

19వ వార్డులో పీపుల్స్ సర్వేని పరిశీలిస్తున్న కలెక్టర్

పక్కాగా పీపుల్స్ సర్వే

● కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీపుల్స్ సర్వే-4ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం ఆయన జేసీ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయసారథితో కలిసి జిల్లాలోని నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాల్లో అట్టడుగున ఉన్న 20శాతం మంది నిరుపేదలను గుర్తించడానికి ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి 28 వరకు జిల్లా వ్యాప్తంగా ఈసర్వేను ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. సర్వే ద్వారా సేకరించిన సమాచారం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అంతకు ముందు పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 19వార్డుల్లో పీపుల్స్ సర్వేని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, ఆనంద్, ఉమ్మడి జిల్లా డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ, వార్డు సచివాలయల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, డీపీఓ సమత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మార్చి 1నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అధికారులతో పరీక్షల నిర్వహణపై శుక్రవారం సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 23,987 విద్యార్థులు 42 కేంద్రాలో పరీక్షలు రాస్తారన్నారు. ఆయా కేంద్రాలో సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు.

భూ రీసర్వేపై ప్రత్యేక సమావేశం

జిల్లాలో నిర్వహిస్తున్న భూముల రీసర్వేపై ఆర్డీఓలు అందరూ డివిజన్ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సమావేశ భవనంలో శుక్రవారం భూ సర్వేపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రైతుల సమక్షంలోనే వారి భూములు రీసర్వే చేయాలన్నారు. అలాగే చుట్టుపక్కల రైతులను కూడా పిలవాలని సూచించారు. త్వరగా రీసర్వే పూర్తి చేసి, రికార్డులు తయారు చేయాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 6గంటలకు రీసర్వే ప్రక్రియ ఎలా జరుగుతుందో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సర్వే శాఖ ఏడీని ఆదేశించారు. జిల్లాలోని ఆర్డీఓలు ఈ భూ రీసర్వేని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు.

ఎందెందు చూసినా..

నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు అవినీతిలో కూరుకుపోయాయి. కాసు ముడితే తప్ప ఏపనీ జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలాది రూపాయల ప్రజా ధనాన్ని జీతంగా తీసుకుంటూ ఇలా మళ్లీ ప్రజల నుంచి వసూళ్లకు తెగబడటం ఏంటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పని జరగాలంటే తప్పదన్నట్లుగా ఆయా అధికారులు అడిగినంతా ముట్టజెబుతున్నారు. ముఖ్యంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, రెవెన్యూ, పోలీసు శాఖలో అవినీతి కార్యకలాపాలు హెచ్చుమీరినట్లు బాధితులు చెబుతున్నారు.





కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి కంపు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరాకాష్టకు..

మిగతా వాటిలోనూ పనికావాలంటే పైసలివ్వాల్సిందే

కదిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల తీరుతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. కదిరిలో ఉన్న ఈ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మూడు నియోజకవర్గాలతో ముడిపడి ఉంది. కదిరి, తలుపుల, గాండ్లపెంట, ఎన్పీకుంటతోపాటు పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ, ఓడీసీ, అమడగూరు, ధర్మవరం నియోజక వర్గంలోని ముదిగుబ్బ మండలం ఈ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉన్నాయి. ఈ మండలాల్లో ప్రజలు భూముల క్రయ విక్రయాలకు కదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాల్సిందే. ప్రతి నిత్యం వందలాదిమంది రిజిస్ట్రేషన్ల కోసం ఇక్కడికి వస్తుంటారు. అయితే ఈ కార్యాలయంలో అంతులేని అవినీతి కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అవినీతిపై స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఓ సబ్‌రిజిస్ట్రార్‌ను హెచ్చరించినా, మరో సబ్ రిజిస్ట్రార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినా ఏమాత్రం మార్పు కానరావడం లేదు. ఇటీవల సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు హోటల్‌లో సంతకాలు చేస్తూ, మీడియాకు దొరికిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ఈనెల 20వరకు సెలవులో వెళ్లినట్లు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఆ సబ్‌రిజిస్ట్రార్ సంతకాలు చేసింది, డాక్యుమెంట్లపైన కాదని ఉన్నతాధికారులు మీడియాకు వివరణ ఇచ్చినా ప్రజలు దాన్ని నమ్మడంలేదు. సెలవు ముగిసినా ఆ సబ్‌రిజిస్ట్రార్ తిరిగి విధులకు హాజరుకాలేదు.

ఎమ్మెల్యే ఆగ్రహం

స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి వ్యవహారం కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొత్తలోనే ఎమ్మెల్యే కందికుంట దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన కార్యాలయానికి వెళ్లి అప్పటి సబ్‌రిజిస్ట్రార్ శిరీషతోపాటు సిబ్బందిని తీవ్రంగా హెచ్చరించారు. అయినా ఆమె పనితీరులో మార్పు రాలేదు. అనంతరం ఆమె బదిలీపై వెళ్లిపోయారు. తరువాత సబ్‌రిజిస్ట్రార్‌గా వచ్చిన శ్రీనివాసులు అనతికాలంలోనే అంతులేని అవినీతికి పాల్పడడం, హోటల్‌లో సంతకాలు చేయడం లాంటి సంఘటనలపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కదిరికి ఇలాంటి వారు అవసరం లేదని హెచ్చరించినట్లు సమాచారం.

విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు

పట్టణంలో ఇటీవల ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమావేశం నిర్వహించి, లేఅవుట్లు లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకూడదని చెప్పారు. ఖాళీ స్థలం పన్ను వేసి పాత ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పారు. అదే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి వరమైంది. సెంటుకు రూ. పదివేలు వంతున సబ్‌రిజిస్ట్రార్ వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపించాయి. విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు కూడా సమాచారం. ఈనేపథ్యంలోనే పట్టణంలోని ఓ హోటల్‌లో విలువైన డాక్యుమెంట్లపై సబ్‌రిజిస్ట్రార్ సంతకాలు చేసినట్లు తెలిసింది. అయితే జిల్లా అధికారులు మాత్రం దాన్ని కప్పి పుచ్చే ప్రయత్నం చేశారు. అయితే తన వ్యవహారం మీడియాలో వచ్చిన రోజు నుంచి ఆ సబ్‌రిజిస్ట్రార్ విధులకు హాజరుకాలేదు.

ఇతర కార్యాలయాల్లోనూ..

పట్టణంలోని మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కొంతమంది అవినీతి సామ్రాట్లుగా విరాజిల్లుతున్నట్లు సమాచారం. మున్సిపాలిటీలో ఓ ముఖ్య అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. రాయల్టీ, టౌన్‌ప్లాన్లు, ఇతర విభాగాల్లో సైతం ఈ అధికారి వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు తెలిసింది. రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓగా పని చేస్తున్న ఓ అధికారి సంతకం పెట్టాలంటే రూ.రెండు వేలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అధికారి పట్టణంలో ఎక్కడ ఏమిజరిగినా తానే చూసుకుంటానని భరోసా ఇచ్చి వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది. గతంలో ఈఅధికారి ఎర్రదొడ్డి గ్రామంలో ఓ నకిలీ సర్టిఫికెట్ ఇచ్చి డబ్బు వసూలు చేసినట్లు తెలిసింది. కదిరి పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో పని చేస్తున్న ఓ పోలీస్ అధికారి కూడా వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. నల్లచెరువులోని ఓ కేసులో బాధితురాలి వద్ద రూ.లక్షలకు లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. తలుపుల, తనకల్లు మండలాలకు చెందిన ఇద్దరు వైసీపీ నాయకుల వద్ద రూ.లక్షలు వసూలు చేసుకున్నట్లు సమాచారం. వీటిన్నింటిపైన ఉన్నతాధికారులు విచారణ జరిపి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అలా పంచుకున్నారు..!

- కొలిక్కి వచ్చిన ఆలయ కమిటీల ఏర్పాటు
- నాలుగు టీడీపీకి, ఒకటి జనసేనకు..
- అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదికలు

హిందూపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కమిటీలు లేక అభివృద్ధి కుంటుబడిన ఆలయాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈనేపథ్యంలోనే నియోజకవర్గంలోని ఆరు ఆలయాలకు కమిటీల ఏర్పాటుకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచనలు, కూటమి పార్టీలోని నాయకుల అభిప్రాయాల మేరకు ఆలయాలు అభివృద్ధి చేసే వారికే కమిటీల్లో స్థానం కల్పించాలని భావించారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల కిందట టీడీపీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రావు, జనసేన హిందూ పురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, బీజేపీ నాయకులు సమావేశమై కమిటీల ఏర్పాటుపై చర్చించారు. ఆరు ఆలయాలకు కమిటీ చైర్మన్ల నియామకానికి చర్యలు తీసుకున్నారు.

టీడీపీకి నాలుగు.. జనసేనకు ఒకటి..

హిందూపురం పట్టణంలోని పురాతన ఆలయమైన పేట వెంకటరమణస్వామి ఆలయంతో పాటు మరో నాలుగు ఆలయాలు, లేపాక్షి ఆలయానికి కమిటీల నియామకంపై కసరత్తు పూర్తి చేశారు. ఇందులో పేట వెంకటరమణ స్వామి ఆలయానికి సంబంధించి ఆర్యవైశ్యులకు, సూగూరు ఆలయ అభివృద్ధి కోసం పనిచేస్తున్న వ్యక్తికే ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. గుడ్డం రంగనాథస్వామి ఆలయానికి బీసీ కులానికి చెందిన వ్యక్తికి ఇవ్వాలని నిర్ణయించారు. లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్‌గా ప్రస్తుతం ఉన్న వారికే కొనసాగించాలని నిర్ణయించినట్లు సమాచారం. అయితే దీన్ని టీడీపీలోని ఓ వర్గం వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. వేణుగోపాలస్వామి ఆలయానికి మాత్రం సభ్యులను మాత్రమే ఎంపిక చేసి చైర్మన్ స్థానాన్ని ఆనవాయితీగా వస్తున్న వారికే ఇవ్వాలని నిర్ణయించారు. అనంతపద్మనాభస్వామి ఆలయానికి సంబంధించి చైర్మన్ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

అన్నివర్గాలకు స్థానం

ఆలయ కమిటీల్లో అన్ని వర్గాలకు స్థానం కల్పిస్తూ కూటమి పార్టీల నాయకులు నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఆలయ కమిటీలోనూ టీడీపీ, జనసేన, బీజేపీ వారిని సభ్యులుగా నియమించాలని నిర్ణయించారు. దీనితో పాటుగా దేవుడికి సేవ చేసే వారికే చోటు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే ఆలయ కమిటీలకు సంబంధించి నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వ అనుమతి కోసం పంపినట్లు తెలిసింది.



జీన్లకుంట వద్ద సాగుచేసిన టమోటా పంట



గ్రేడింగ్ చేసిన టమోటాలు

టమోటా రైతుకు మద్దతు

- వారం రోజులుగా ధరలు పతనం
- సరిహద్దులు దాటినా నిష్ప్రయోజనం
- కర్ణాటకలో బాక్స్ రూ.80
- స్పందించిన ప్రభుత్వం..
- రంగంలోకి మార్కెటింగ్‌శాఖ
- కిలో రూ.8 ప్రకారం కొనుగోలు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

టమోటా ధరలు భారీగా పతనమయ్యాయి. వారం రోజులుగా కనీస ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లా రైతాంగం టమోటాను అమ్ముకునేందుకు సరిహద్దులు దాటి.. తెలంగాణ, కర్ణాటక మార్కెట్‌లకు తరలించినా గిట్టుబాటు కావడం లేదు. మేలు రకం టమోటా సైతం కిలో రూ.3 నుంచి రూ.5 పలకడం లేదు. కూడేరు రైతులు వారం క్రితం కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు దిగుబడులు తీసుకురాగా.. బాక్సు రూ.50 మాత్రమే పలికింది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండల రైతులు కొక్కంటి క్రాస్, అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువు, అంగళ్లు, మదనపల్లి మార్కెట్‌లకు దిగుబడులను తరలించగా.. 25 కిలోల బాక్స్ రూ.80 నుంచి రూ.120 మాత్రమే ధర పలికాయి. కళ్యాణదుర్గం ప్రాంత రైతులు మదనపల్లి, శ్రీనగర్, కర్ణాటకలోని కోలారు, బాగేపల్లి, శ్రీనగర్ టమోటా మార్కెట్‌లకు తరలించగా.. 16 కేజీల బాక్స్ ధర రూ.100 నుంచి రూ.170 మాత్రమే పలికింది. దీంతో ప్రభుత్వం స్పందించింది. మద్దతు ధరతో కొనుగోలు చేయాలని మార్కెటింగ్ శాఖను ఆదేశించింది. అధికారులు తొలిరోజు శుక్రవారం కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో రూ.8 ప్రకారం రైతుల నుంచి దిగుబడులను కొనుగోలు చేసి..

(మిగతా 7వ పేజీలో..)

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

శ్రీసత్యసాయి జిల్లాలో టమోటా రైతుల కోసం పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. రైతులకు సాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 1,013 హెక్టార్లల్లో టమోటా పంట వివిధ దశల్లో ఉందని ఆయన పేర్కొన్నారు. మార్కెటింగ్ సమస్యలు ఎదురైతే రైతులు కంట్రోల్ రూమ్ నంబర్ 08555-289431, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సెల్ నంబర్ 9182361127, జిల్లా ఉద్యాన శాఖాధికారి సెల్ నంబర్ 7995086791కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి, దర్యాప్తు వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాపోలీసు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలతో ఆమె నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ, పోక్సో లోక్ అదాలత్ కేసుల గురించి ఆరా తీశారు. వివిధ కేసుల్లో అరెస్టయిన వారిపై త్వరగా చార్జ్‌షీట్ వేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. బాలికలు, మహిళపై అఘాయిత్యాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రోన్, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచి సమస్యలు తెలుసుకోవాలన్నారు. రాత్రివేళ ల్లో



బీట్లు పెంచాలని, పల్లెనిద్రలు ఎక్కువగా చేయాలన్నారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి రోడ్డుప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్ర భుత్వ హాస్టళ్లు, పాఠశాలల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాల్లో బందోబస్తు పరంగా అన్ని జా గ్రత్తలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై దృష్టి సారించి, అరికట్టాలని సూచించారు. అనంతరం జిల్లాలో నేరాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, మహేష్, హేమంత్‌కుమార్, ఆదినారాయణ, లీగల్‌సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్బీసీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాయి ఆరామంలో మాట్లాడుతున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి

వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

● జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047 లక్ష్యంగా కేంద్ర బడ్జెట్‌ను రూపొందించినట్లు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సాయిఆరామంలో శ్రీసత్యసాయిజిల్లా బీజేపీ అధ్యక్షుడు జీఎం శేఖర్ అధ్యక్షతన కేంద్రప్రభుత్వ బడ్జెట్‌పై మేధావులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి వాటిని సమన్వయం చేసుకుంటూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నిధులు కేటాయింపులు చేశారన్నారు. మధ్యతరగతికి ఊరట కలిగేలా ఆదాయపువన్ను పరిమితిని పెంచారన్నారు. దేశ ప్రజలందరి సహకారంతో కేంద్రప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు, సంస్కరణల దిశగా అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎంఎస్ పార్థసారథి, జాతీయ కార్యవర్గ సభ్యులు అంబటి సతీష్, ఉత్తమరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు అమరేంద్ర, రాజారెడ్డి, మేకలశ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొండమరాజు, కల్లుగీత కార్మికుల ఫెడరేషన్ కన్వీనర్ హరికృష్ణ, పట్టణ బీజేపీ అధ్యక్షుడు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ

ఎనిమిదో రోజూ కొనసాగిన యజ్ఞం

పుట్టపర్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి, లోకసంరక్షణ కోసం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్‌లో చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞం 8వరోజు శుక్రవారం కూడా కొనసాగింది. హరహర మహాదేవ అంటూ శివుడికి అభిషేకాలు చేశారు. వందల మంది పండితులు యజ్ఞాన్ని కొనసాగించారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు యజ్ఞం చేశారు. శివలింగానికి వేదపండితులు పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. గణపతి పూజతో యజ్ఞాన్ని మొదలుపెట్టి, సాయంత్రం సాయికుల్వంత్‌లో ప్రముఖ గాయకులు రమ్య, బెహరా బృందం కచేరి నిర్వహించింది.





తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న భాషా ప్రేమికులు

మాతృభాషను రక్షించుకోవాలి

తెలుగు భాషా సంరక్షణ సమితి అధ్యక్షుడు నారాయణ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెలుగు భాషా సంరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ నారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఎస్ఎస్‌బీఎన్ హైస్కూల్ నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మాతృభాష మాతృమూర్తితో సమానమన్నారు. జీవనోపాధి కోసం ఆంగ్లాన్ని నేర్చుకోవడం తప్పుకాదని, అదే సర్వస్వం అనుకోవడమే తప్పు అవుతుందన్నారు. తేనెవంటి తెలుగును రక్షించుకోవాలంటే రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలోనూ కనీసం ఐదో తరగతి వరకైనా తెలుగు మాధ్యమంలోనే బోధన జరగాలన్నారు. శిశువు మానసిక వికాసానికి మాతృభాషను మించింది ఏదీ లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీఎన్ హైస్కూల్ హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగరాజు, ముత్యాలప్ప, వెంకటనారాయణ, నానీల నాగేంద్ర, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, పీవీకేకే ఉపాధ్యాయుడు ఈరన్న, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

యాపారం మొదలైంది..!

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్లు ప్రారంభం

- విద్యా సంవత్సరం ముగియకనే సందడి
- టీచర్లు, సిబ్బందికి 'యాజమాన్యాల' టార్గెట్
- పిల్లలను చేర్చకపోతే జీతంలో కోతలు
- ఇతర స్కూళ్లకు తరలివెళ్లకుండా విద్యార్థులకు ఫీజుల వల
- చోద్యం చూస్తున్న విద్యాశాఖాధికారులు

నియోజవకర్గం	కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు	పనిచేస్తున్న సిబ్బంది
అనంతపురం అర్బన్	176	1428
గుంతకల్లు	132	913
కళ్యాణదుర్గం	36	334
రాప్తాడు	50	510
రాయదుర్గం	60	404
శింగనమల	60	456
తాడిపత్రి	117	950
ఉరవకొండ	47	328
మొత్తం	678	5,323

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'ఫీజు కట్టండి. బుక్స్ కొనుక్కోండి'. విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రైవేట్ స్కూళ్ల వద్ద ఈ మాటలు సర్వసాధారణం. కానీ నాలుగు నెలల ముందే వినిపిస్తున్న ఈ మాటలు తల్లిదండ్రులకు కర్ణకఠోరమనిపిస్తున్నాయి. విద్యా సంవత్సరం ముగియడానికి ఇంకా రెండు నెలల సమయం ఉంది. కానీ కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో అప్పుడే బుక్కుల వ్యాపారం మొదలెట్టేశారు. 2025-26 విద్యాఏడాదికి ఇప్పటి నుంచే ముందస్తు అడ్మిషన్ల పేరుతో వ్యాపారం మొదలెట్టారు. దీనికి కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే టీచర్లు బలి అవుతున్నారు. క్లాసులు చెప్పడం అటుంచితే, అడ్మిషన్ల టార్గెట్‌తో వేధిస్తున్నారు.

జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు



శ్రీచైతన్య, నారాయణ వంటి కొన్ని కార్పొరేట్ స్కూళ్లు ముందస్తు అడ్మిషన్ల కోసం టీచర్లను వేధిస్తున్నారు. కొన్ని స్కూళ్లలో అడ్మిషన్లు చేయకపోతే జీతం హోల్డ్‌లో పెడతామంటూ బెదిరిస్తున్నారు. హాలిడేస్‌లో ఫోన్లలోనూ, బయట తిరిగి అడ్మిషన్ల కోసం క్యాంపెయిన్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

- సురేష్ యాదవ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య

సిబ్బందికి అడ్మిషన్ల వేధింపులు


జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే సిబ్బందికి అప్పుడే అడ్మిషన్ల కష్టాలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 678 కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 1,94,674 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. అధికారిక లెక్కల మేరకు 5,323 మంది టీచర్లు పని చేస్తున్నారు. అనధికారికంగా మరో 20 శాతం మంది ఉండే అవకాశం ఉంది. అయితే టీచర్లను కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లు ఉత్పత్తి చేసే యంత్రాల్లా చూస్తున్నారు. ప్రతి టీచర్‌కు ముందస్తు అడ్మిషన్ల టార్గెట్ ఇస్తున్నారు. వచ్చే ఏడాది అడ్మిషన్లు చేయకుంటే ఉద్యోగాలు ఉండవంటూ హెచ్చరిస్తున్నారు. వారానికి హాస్టల్ అడ్మిషన్లు 2 లేదా 3, డేస్కార్ అడ్మిషన్లు సైతం 2 లేదా 3 తప్పనిసరిగా చేయాలి. ఫోన్లలో అడుక్కుంటారో.. లేక ఇల్లిల్లు తిరిగి చేస్తారో మాకు తెలియదు. మీకిచ్చిన టార్గెట్ పూర్తి చేయాల్సిందే అని వేధిస్తున్నారు. ఈక్రమంలోనే రెండో శనివారం, ఆదివారం కూడా సెలవులు ఇవ్వకుండా పాఠశాలలకు రప్పిస్తున్నారు. దీంతో కుటుంబాలను వదిలి వారం మొత్తం జీవితాలను పాఠశాలకే అంకితం చేయాల్సిన దుస్థితిని చాలా ప్రైవేట్ స్కూళ్ల సిబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇంతటితో ఆగక అడ్మిషన్ల టార్గెట్ చేయకుంటే జీతాలు నిలిపేస్తామని, కోత విధిస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఇచ్చే అరకొర జీతాల్లో కూడా కోత పెడితే ఎలా బతికేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు టీచర్లకు జీతాల్లో కోత పెట్టి, వాళ్లకు తోచినంత చేతిలో పెట్టినట్లు తెలిసింది.

ముందే.. బుక్స్, ఫీజులు

ముందస్తు అడ్మిషన్లు చేయడమే కాకుండా ఇప్పటికే స్కూళ్లలో ఉన్న పిల్లలు జారిపోకుండా ఫీజులు కట్టించుకుని, బుక్స్ అంటగట్టి ఇరికించుకుంటున్నారు. పలు కార్పొరేట్ స్కూళ్లలో డేస్కాలర్ విద్యార్థులకు రూ. 3500, హాస్టల్ విద్యార్థులకు రూ. 5,500 అడ్మిషన్ల ఫీజులుగా గుంజుకుంటున్నారు. పుస్తకాల కోసం అని రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకూ లాగేస్తున్నారు. 9 వ తరగతి పూర్తయిన విద్యార్థులకు పదో తరగతికి అడ్మిషన్‌ను ముందే కన్ఫర్మ్ చేసుకుంటున్నారు. అయితే చాలా కార్పొరేట్ స్కూళ్లలో 2025-26 అడ్మిషన్ల కోసం ఇప్పటి నుంచే పుస్తకాలు, అడ్మిషన్లు అంటూ కౌంటర్లు, దుకాణాలు తెరిచినా...జిల్లా విద్యాశాఖాధికారులు మాత్రం నిద్రమత్తులో జోగుతున్నారు.



నిద్రమత్తులో విద్యాశాఖ



2025-26 విద్యాఏడాది ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యాసంస్థలు మాఫియాను సాగిస్తున్నాయి. ముందుగానే అడ్మిషన్లు తేవాలంటూ టీచర్లను వేధిస్తున్నారు. రూ. 5,500 నుంచి రూ. 10,500 ఇలా అడ్మిషన్ల కోసం ఇప్పటి నుంచే ఫీజులు కట్టించుకుంటున్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు మౌనంగా ఉండటం దారుణం. వీటిపై జిల్లా కలెక్టర్ స్పందించాలి.

- పరమేశ్వర్, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి

తనిఖీ చేయాలని ఆదేశిస్తా



విద్యా ఏడాది ముగియక ముందే కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధం. 2025-26 విద్యాఏడాది ప్రారంభం కాక ముందే ఏ పాఠశాలలో కూడా అడ్మిషన్లు చేయకూడదు. ఎక్కడ అడ్మిషన్లు చేస్తున్నా వెంటనే చర్యలు తీసుకుంటాం. డిప్యూటీ డీఈఓలు, మండల విద్యాశాఖాధికారులకు ముందస్తు అడ్మిషన్లపై తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేస్తా.

- ప్రసాద్ బాబు, డీఈఓ, అనంతపురం

కేసులు నమోదు చేయాలి



విద్యా సంవత్సరం ఇంకా రెండు నెలలు ఉండగా ఇప్పటి నుంచే రాబోయే ఏడాదికి అడ్మిషన్లు చేయాలంటూ పాఠశాల సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. ముందస్తు అడ్మిషన్లు చేయరాదంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నా, వాటిని బేఖాతరు చేస్తూ విచ్చల విడిగా సాగిస్తున్నారు. ముందస్తు అడ్మిషన్ల కోసం ఒత్తిడి చేస్తున్న యాజమాన్యలపై కేసులు నమోదు చేయాలి.

- నరేష్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎన్ఎస్‌యూఐ

ఆందోళన చేస్తాం..



ప్రభుత్వ నిబంధనల మేర కు విద్యా ఏడాది ఆరంభమైన తర్వాత అడ్మిషన్లు చేపట్టాలి. కానీ 20 25-26 విద్యా ఏడాదికి ఇప్పటి నుంచి అక్రమం గా అడ్మిషన్లు చేయడం రూల్స్‌కు విరుద్ధం. ముందస్తు అడ్మిషన్ల కోసం టీచర్లపై ఒత్తిడి తెస్తున్నారు. టార్గెట్లు పెట్టి వేధిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న యాజమాన్యాలపై వెంటనే డీఈఓ చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తాం.

- పాపిరెడ్డిపల్లి పృథ్వి, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధానకార్యదర్శి

సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి



విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కార్పొరేట్ స్కూళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ముందస్తు అడ్మిషన్లు కోసం సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. అధికారులను సైతం శాసించే స్థాయిలో కార్పొరేట్ శక్తులు వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం ఫీజు రెగ్యులేటింగ్ కమిటీని తీసుకొచ్చి అడ్మిషన్లు, ఫీజుల వేధింపులపై టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి, ఫిర్యాదులు స్వీకరించాలి.

- చంద్రశేఖర్, వైఎస్ఆర్ విద్యార్థి విభాగం, జిల్లా అధ్యక్షుడు

రూ. 5 వేలు ఇప్పుడే కట్టాలట



జిల్లాలో పలు కార్పొరేట్ స్కూళ్లలో ఇప్పుడే అడ్మిషన్ల సందడి మొదలు పెట్టారు. విద్యా ఏడాది ముగియక ముందే...వచ్చే విద్యా ఏడాది అడ్మిషన్‌కు సంబంధించి రూ. 5 వేలు కట్టాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. జూన్‌లో చేయాల్సిన అడ్మిషన్లు ఇప్పుడే మొదలెట్టారు. ఫిబ్రవరిలోనే పుస్తకాలు కూడా కొనాలని ఒత్తిడి తెస్తున్నారు. టీచర్లకు టార్గెట్లు పెట్టి బెదిరిస్తున్నారు. విద్యాశాఖాధికారులు దీనిపై స్పందించాలి.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రైళ్లలో దొంగతనాలను కట్టడి చేయాలి: జీఆర్పీ ఐజీపీ

గుంతకల్లు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వేసవిలో రైళ్లలో దొంగతనాలను కట్టడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రైల్వే పోలీసు శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీపీ) కేవీ మోహన్ రావు పేర్కొన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశ భవనంలో ఏపీ, కర్ణాటక రాష్ట్రలకు చెందిన జీఆర్పీ, ఆర్పీఎఫ్, సివిల్ పోలీసు శాఖల అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏపీ రైల్వేస్ ఐజీపీ మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో రైళ్లలో దొంగతనాలు జరిగే ప్రాంతాలు, దోపిడీలకు పాల్పడే గ్యాంగులు, ఆ గ్యాంగులు ప్రయాణికులను దోచుకునే విధానం, తదితర అంశాలపై చర్చించారు. ఐజీపీ మాట్లాడుతూ బంగారం ధరలు ఆకాశాన్నంటినా వినియోగం తగ్గని కారణంగా స్వర్ణకారులు రైళ్లల్లో బంగారాన్ని తెస్తూ ఉంటారని, దోపిడీ ముఠాలు వారిని టార్గెట్ చేస్తాయని తెలిపారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడానికి రైళ్లల్లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ శాఖలు సమన్వయంతో గస్తీలను నిర్వహించాలన్నారు. అన్ని శాఖల సమన్వయం సాధించి రైళ్లల్లో నేరాలను కట్టడి చేయడమే బోర్డర్ క్రైం మీటింగ్ లక్ష్యమన్నారు. సమావేశంలో గుంతకల్లు డివిజన్ జీఆర్పీ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

అనంతా.. మభ్యపెట్టే మాటలు మానుకో...

జగన్‌రెడ్డికి భద్రత తగ్గించారనడం హాస్యాస్పదం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): 'మీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేసినందుకే ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. ఆ విషయాన్ని మరచి మరోసారి ప్రజలను మభ్యపెట్టే మాటలు మాట్లాడటం ఇకనుంచైనా మానుకోవాల'ని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హితవు పలికారు. జగన్‌రెడ్డికి భద్రత తగ్గించారని కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... మిర్చి రైతులకు మద్దతు ధర లేదని గుంటూరు మిర్చి యార్డులో నిరసన చేయాలని జగన్‌రెడ్డి వెళ్లడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉందన్న సంగతి ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్‌కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అక్కడికి వెళ్లారే తప్ప... అక్కడ ఏం వెలగబెట్టారో చెప్పాలని నిలదీశారు. అధికారంలో ఉన్నపుడు మిర్చి రైతులకు రూపాయి మేలు చేశారా అని ప్రశ్నించారు. దౌర్జన్యంగా మిర్చి యార్డులోకి వెళ్లి అక్కడున్న వారిని భయభ్రాంతులకు గురిచేశారన్నారు. వైసీపీ అధినేత జగన్‌రెడ్డికి సెక్యూరిటీ తీసేశామంటున్నారనీ, ఆయన మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయనకు సెక్యూరిటీ కల్పిస్తున్నామన్నారు. అమ్మఒడి పథకం ఇవ్వకుండా చేశారని పేటీఎం బ్యాచ్‌లు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివే పాపతో అబద్ధాలు చెప్పిస్తే నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇలాంటి చిల్లర వేషాలు మానుకోవాలని ఆ పార్టీ నేతలను హెచ్చరించారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, లీగల్ సెల్ రాష్ట్ర నేత గాజుల ఆదెన్న, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్ పాల్గొన్నారు.

జగన్ ప్రజల్లో తిరగకూడదనే భద్రత కుదింపు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల్లో తిరగకుండా చేసేందుకే భద్రత కుదించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు చేస్తున్నారన్నారు. ఇల్లీగల్ యాక్టివిటీస్‌కు భద్రత కల్పించలేమని చంద్రబాబు చెప్పడం దుర్మార్గమన్నారు. రైతులను పరామర్శించటం చంద్రబాబు దృష్టిలో ఇల్లీగల్ యాక్టివిటీయా..? అని ప్రశ్నించారు. మిర్చి రైతులను జగన్ పరామర్శిస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు రాజకీయ విలువలు లేవా అని ప్రశ్నించారు. జగన్‌తో ఫొటో దిగిన చిన్నారిపై సోషల్ మీడియాలో టీడీపీ సైకోలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. అమ్మ ఒడి వస్తుందో... రాలేదో.. నారాయణ, చైతన్య స్కూళ్ల వద్ద అడిగినా చెబుతారన్నారు.



డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాతో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

సమస్యలు పరిష్కరించండి

డీఆర్ఎం సీఎస్ గుప్తాతో ఎంపీ అంబికా, ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): అవసరమైన మేరకు నిధులు వచ్చేలా చేస్తామని, రైలు వంతెనల సమస్యను పరిష్కరించాలంటూ డీఆర్ఎం సీఎస్ గుప్తాను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కోరారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయానికి ఎంపీ, ఎమ్మెల్యే శుక్రవారం వెళ్లారు. ఈ సందర్భంగా డీఆర్ఎంతో పలు విషయాలు చర్చించారు. పట్టణంలోని కసాపురం రోడ్డులో ఉన్న ఆర్‌యూబీని వెడల్పు చేయడం, ధర్మవరం గేటు, హనుమాన్ సర్కిల్ వద్ద ఉన్న లైన్‌పై కొత్త ఆర్‌యూబీలను నిర్మించే విషయంగా చర్చించారు. ఈ వంతెనల వ్యయాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని, సమస్యను పరిష్కరించాలని కోరారు. కొత్తగా నిర్మించనున్న బైపాస్ లైన్ కింద భూములు పోగొట్టుకుంటున్న గుంతకల్లు, కసాపురం, చిప్పగిరి గ్రామాల రైతుల సమస్యలపై చర్చించారు. ఈ విషయంగా స్థానిక ఆర్డీవో శ్రీనివాసులుతో సమావేశమై రైతులకు అన్యాయం జరక్కుండా సాగునీటి సౌకర్యమున్న భూములకు ఇచ్చే పరిహారాలను రైల్వే ఇచ్చేలా చూడాలన్నారు. కరోనా సమయంలో నిలిచిన రైళ్లను పునరుద్ధరించాలని, నరసాపూర్-ధర్మవరం రైలు గమ్యాన్ని గుంతకల్లు వరకూ పొడిగించాలని, హుబ్లీ-విజయవాడ ఎక్స్‌ప్రెస్ గుంతకల్లుకు అర్ధరాత్రి వస్తోందని, దాన్ని 3 గంటలు ఆలస్యంగా నడిపితే రాయలసీమ ప్రజలకు ఉపయో గకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, మష్బూరు తిమ్మప్ప, ముష్బూరు భాస్కర్, పూల రమణ, యూ ప్రభాకర్ పాల్గొన్నారు. .

నేడు 'పాల్'పై శిక్షణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పర్సనలైజ్డ్ అడాప్టింగ్ లర్నింగ్ (పీఏఎల్) కార్యక్రమంపై శనివారం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 53 స్కూళ్లలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాన్ని గుర్తించి, వారు నేర్చుకునే విధానాన్ని మెరుగుపర్చాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా గతంలో 32 కేజీబీవీల్లో ప్రిన్సిపాళ్లకు, గణితం, ఇంగ్లీష్, తెలుగు టీచర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. 15 మోడల్ స్కూళ్ల, ఆరు రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు శనివారం శిక్షణ ఇస్తామన్నారు. సంబంధిత ప్రిన్సిపాళ్లు, టీచర్లు విధిగా హాజరుకావాలన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి: ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ జగదీష్.. పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం అనంతపురం రూరల్ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మట్కా, పేకాట, గంజాయి, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు. కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరాతీశారు. సమీక్షలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేష్, సీఐలు శేఖర్, హేమంత్ కుమార్, శ్రీహర్ష, కరుణాకర్, కౌలుట్లయ్య, సత్తిబాబు పాల్గొన్నారు.

అపురూపం..!

సృష్టిలో అద్భుతం... కవలల బంధం

కష్టసుఖాల్లో ఒక్కటిగా.. ఒకరికొకరుగా..

నేడు కవలల దినోత్సవం

ఒకరు నవ్వితే..
మరొకరి మోములో
ఆనందం చిగురిస్తుంది..
ఒకరు ఏడిస్తే..
మరొకరి కళ్లు చెమరుస్తారు..
కష్టాలు.. కన్నీళ్లు..
సుఖాలు.. బాధలు..
అన్నీ పంచుకుంటారు..
అన్నింటా కలిసే ఉంటారు..
ఒక్కటిగా..
ఒకరికొకరుగా..
అదే కవలల బంధం..
సృష్టిలో అపురూప అనుబంధం..
అతి కొద్దిమందికే దక్కే భాగ్యం..

22నే ఎందుకు?

కవలల దినం ఫిబ్రవరి 22వ తేదీనే నిర్వహించడంలో ఓ ప్రత్యేకత ఉంది. ఫిబ్రవరి రెండో నెల. అందులోనూ 22వ తేదీలో రెండు రెళ్లు ఉంటాయి. కవలలు అంటే ఇద్దరు కావున, ఫిబ్రవరి 22వ తేదీన నిర్వహిస్తారు.

యాడికి, అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో అద్భుతం కవలల బంధం. ఒకే రూపం కలిగిన ఇద్దరు.. ఒకే ఇంటిలో ఉంటే దానిని అద్భుతం కాక ఏమంటారు? కొంతమంది కవల పిల్లల్లో ఎవరు, ఎవరో కనుక్కోవడం కష్టమే. అది కుటుంబ సభ్యులకే సాధ్యం. ఇద్దరు ఒకే పోలికలతో ఉండడం, ఒకే తరహా డ్రస్ వేసుకోవడం, వారి పేర్లు కూడా అన్నదమ్ముల పేర్లే పెట్టడం ఇలా అంతా ఒకేలా ఉండడం... అన్నీ గొప్ప అనుభూతులే. ఫిబ్రవరి 22వ తేదీన కవలల దినం నిర్వహించుకుంటారు. కవలలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కవలలు అంటే..

ఒకే కాన్పులో ఇద్దరు జన్మిస్తే వారిని కవలలు అంటారు. తల్లి ఒక ఆడ, ఒక మగ బిడ్డకు జన్మనివ్వవచ్చు. ఇద్దరు మగపిల్లలకు జన్మనివ్వవచ్చు. ఇద్దరు ఆడపిల్లలకు జన్మనివ్వవచ్చు. వైద్య పరిభాషలో ఒకే పోలికలతో ఉన్న కవలలను ఐడెంటికల్ ట్విన్స్ అనీ, వేర్వేరు పోలికలతో ఉన్న వారిని నాన్ ఐడెంటికల్ ట్విన్స్ అని పిలుస్తారు. కవలలను పెంచడంలో కొన్ని సమస్యలు ఎదురైనా వారి తల్లిదండ్రులు వాటిని ఆనందంగా స్వీకరిస్తుండడం గమనార్హం. కవలలుగా పుట్టిన వారిలో ఆప్యాయత, అనురాగాలు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఒకరికి కష్టం వస్తే మరొకరు స్పందిస్తుంటారు.

పోలికలు సేమ్.. అలవాట్లు వేర్వేరు..

కవలలు ఒకే రూపంలో ఉన్నా.. వారి వేలిముద్రలు, కళ్లు మాత్రం వేరుగా ఉంటాయి. కొంతమంది కవలల ముఖ కవళికలు ఒకేలా ఉన్నా వారి శారీరక బరువు వేర్వేరుగా ఉంటుంది. వారి ఆకృతి ఒకేలా ఉన్నా.. ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. ఇద్దరిలో రోగనిరోధక శక్తుల్లో కూడా తేడా ఉంటుంది.

అన్నింటా ముందంజ



అనంతపురంలోని కోవూరునగర్‌కు చెందిన చిదానందమూర్తి, నిర్మల దంపతులకు కలిగిన కవలలు సందీప్, సంతోష్ వారి ఆలోచనలు, ప్రవర్తన ఒకేలా ఉంటాయంటున్నారు వారి తల్లిదండ్రులు. సందీప్ ఎంటెక్ పూర్తి చేసి, ప్రాజెక్ట్ అసోసియేట్‌గా పనిచేస్తున్నాడు. సంతోష్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతూ ఐసీఐసీ ఐ బ్యాం కులో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా ఉద్యోగం పొందాడు. వీరిద్దరూ చదువుతోపాటు అన్నింటా ముందంజలో ఉంటారంటున్నారు వారి తల్లిదండ్రులు.

దేవుడి వరం



అనంతపురానికి చెందిన జిలాన్‌బాషా, షకృన్నీషా దంపతులకు పెళ్లైన ఎనిమిదేళ్ల వరకు సంతానం లేదు. ఆ తర్వాత కవలలు జన్మించారు. అది కూడా ఆడపిలలు. వారికి జిక్రా, బుష్రా అని పేర్లు పెట్టుకున్నారు. వారిరువురి అలవాట్లు ఒకేలా ఉంటాయంటున్నారు. చదువులో ఒకరికొకరు సాయం చేసుకుంటుంటారట. ఇంట్లోనూ తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఒకరిని మించి ఒకరు ప్రేమానురాగాలు కనబరుస్తుంటారు. కవల బిడ్డలు దేవుడిచ్చిన వరం అంటూ ఆ తల్లిదండ్రులు ఆనంద పడుతుంటారు.

నిర్ణయాలు కలిసే తీసుకుంటాం

రామ్‌లక్ష్మణ్, రాయలచెరువు



మాకు ఇప్పుడు 33సంవత్సరాలు. మా ఇద్దరి ఆలోచనలు, నిర్ణయాలు ఒకే విధంగా ఉంటాయి. ఏవీఎస్ నెట్ కేఫ్, ఏవీఎస్ మినరల్స్ నిర్వహిస్తున్నాం. ఏది చేసినా కలిసే చేస్తాం. ఇద్దరం ఒకేసారి కోప్పడతాం. కొద్దిసేపటికి సర్దుకుంటాం. లోకంలో దేవుడు ఇచ్చిన అద్భుత సృష్టి కవలలు. మా మధ్య ఏనాడూ విభేదాలు తలెత్తలేదు.

దేవుడిచ్చిన వరం

పవన్, ప్రభంజన్, యాడికి



కవలలుగా బతకడం దేవుడిచ్చిన వరం. మాకు ఇప్పుడు 28 సంవత్సరాలు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, ఫైనాన్స్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నాం. ఏ సమస్య వచ్చినా ఇద్దరం పంచుకుంటాం. దుఃఖమైనా, సంతోషమైనా ఇద్దరం పంచుకుంటాం. బంధువుల ఇళ్లకు ఇద్దరం కలిసి వెళ్లినపుడు అందరూ చూసి ఆశ్చర్యపోతుంటారు. కొన్నిసార్లు ఎవరు ఎవరని గుర్తుపట్టలేకపోతుంటారు. మా మాట, నడవడిక ఒకేలా ఉంటాయి.

టమోటా రైతుకు మద్దతు

(5వ పేజీ తరువాయి)

విజయవాడ, గుంటూరు రైతు బజార్లకు తరలించారు. కాగా, స్థానికంగా ధరలు లేవని.. ఇతర ప్రాంతాలకు టమోటాలను తరించిన రైతులు మరింత నష్టపోయారు. రవాణా, కూలీల ఖర్చులు అదనంగా భరించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీ పెట్టుబడులు..

శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలంలో ప్రధానంగా పండించే పంట టమోటా. ఇక్కడ రెండు వందల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో టమోటాను సాగుచేశారు. నర్సరీల్లో ఒక్కో మొక్కను రూపాయి నుంచి ఒకటిన్నర రూపాయ వెచ్చించి కొనుగోలుచేస్తారు. కర్ర లను నాటి అధిక దిగుబడులు సాధిస్తారు. చీడపీడలను నివారించడానికి భారీగా ఖర్చు చేస్తారు. టమోటా మొక్కలకు వినియోగించే ఒక్కో నీలగిరి కర్రను రూ.30 వెచ్చించి కొంటారు. ఎకరానికి 14 వందల కర్రలు పడ తాయి. వీటికి దాదాపు రూ.50వేలు ఖర్చు వస్తుంది. కట్టెలకు టైన్‌పురి కట్టడానికి ఎకరా నికి మరో రూ.పది వేలు ఖర్చు అవుతుంది. పంట కోతకు వచ్చేసరికి ఎకరానికి ఎంతలేదన్నా రూ.లక్ష పెట్టుబడి అవుతుంది. దీనికి అప్పులు చేస్తారు. తీరా కోతకు వచ్చాక ధరలు పతనమౌతున్నాయి. ఏం చేయాలో, అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నష్టానికి అమ్మకం..

అనంతపురం జిల్లా కూడేరు మండలంలో దాదాపు 350 ఎకరాల్లో టమోటాను సాగు చేశారు. గార్లదిన్నె మండలంలో వందలాది ఎకరాల్లో టమోటా సాగైంది. గార్లదిన్నె, తిమ్మంటపేట, మర్తాడు, సంజీవపురం, కొప్పల కొండ తదితర గ్రామాల్లో ఎక్కడ చూసినా టమోటా పంట కనిపిస్తుంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 325 ఎకరాలకు పైబడి టమోటా పంటను సాగు చేశారు. సాగు సమయంలో టమోటా ధర బాగానే ఉంది. అందుకే కష్టాలు తీరుతాయని రైతులు ఆశించారు. కానీ కోత సమయానికి పరిస్థితి తరుమారు అయింది. మార్కెట్‌కు తరలిస్తే కిలో రూ.8 పలుకుతోందని, ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 కేజీల బాక్స్‌కు రూ.125 ఇస్తున్నారని, ఈ ధర కూలీలకు, రవాణాకు మాత్రమే సరిపోతుందని అంటున్నారు. చాలామంది రైతులు పంటను వదిలేయలేక మార్కెట్‌కు తరలిస్తున్నారు. నష్టాలకు అమ్ముకుంటున్నారు. మరికొందరు రైతులు పంటను పశువులకు వదిలేస్తున్నారు.

మార్కెటింగ్ శాఖ కొనుగోలు

టమోటా ధరలు తగ్గుతుండటంతో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోళ్లను ప్రారంభించారు. కక్కలపల్లి మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీకాంత్‌రెడ్డి, రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ టమోటాను కొనుగోలు చేశారు. వీటిని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తామని అధికారులు తెలిపారు. కిలో రూ.8తో 30 టన్నులు కొనుగోలు చేసి విజయవాడ, గుంటూరుకు పంపించారు.

తగ్గించేశారు..



మూడు ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. నాలుగు రోజుల క్రితం 16 కిలోల టమోటా బాక్స్ ధర రూ.200లకు అమ్ముడుపోయింది. ఇప్పుడు కేవలం రూ.100కు పడిపోయింది. ధర ఒక్కసారిగా పడిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- రామాంజనేయులు, మేళ్లకుంట

పెట్టుబడి కూడా చేతికిరాదు..



మూడు ఎకరాల్లో రూ.3 లక్షలు ఖర్చు చేసి టమోటా పంటను సాగు చేశారు. 16 కేజీల టమోటా బాక్స్‌కు మొన్నటివరకు రూ.200 ధర ఉండేది. ఇప్పుడు రూ.100కు పడిపోయింది. పెట్టుబడి కూడా చేతికి రాదు. ఇలా అయితే రైతులు ఎలా బాగుపడతారు..? ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి.

- నరేష్, ఒంటారెడ్డిపల్లి

అమాంతం తగ్గిపోయింది..



నాలుగు రోజుల వ్యవధిలోనే టమోటా ధరలు అమాంతంగా తగ్గిపోయాయి. బాక్సు రూ.100 పలుకుతోంది. ఇలా ధరలను తగ్గించేస్తే మాకు పెట్టుబడి కూడా దక్కదు. తోటల్లోనే టమోటాను వదిలేసే పరిస్థితి వస్తోంది. మరికొన్ని రోజులు ఇవే ధరలు ఉంటే నష్టం తప్పదు.

- రవి, ఒంటారెడ్డిపల్లి

నట్టేట మునగాల్సిందే..



ఈ సారి టమోటా పంటతో గట్టెక్కవచ్చు అనుకున్నాను. అన్ని పంటలనూ నష్టపోయాను. టమోటా కూడా ఇలా నష్టాలను తెస్తుందని అనుకోలేదు. ధర బాగుందని సాగు చేశాను. ఆనందం ఆవిరైపోయింది. రూ.100కు బాక్స్ అంటే నష్టాలు ఎదుర్కోక తప్పదు. టమోటా సాగు చేయాలంటే భయపడే పరిస్థితులు వచ్చాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- రామాంజి, మేళ్లకుంట

కూలి డబ్బులు కూడా రాలేదు..



రెండు ఎకరాలో టమోటా సాగు చేశాను. గతంలో ధర బాగుండటంతో మంచి జరుగుందని లక్షన్నర వరకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాను. దిగుబడి ఆశాజనంగా ఉంది. కానీ మార్కెట్‌లో ధర పతనం కావడంతో అప్పులపాలయ్యాం. పొలంలో కాయలు తొలగించిన కూలీలకు కూడా డబ్బులు రాలేదు. - అంకె రామాంజినేయులు, కూడేరు

పశువులకు వదిలేశా...



మూడున్నర ఎకరాలలో రెండు లక్షల వరకు ఖర్చు చేసి టమోటా సాగు చేశాను. ధర పూర్తిగా పడిపోయింది. దిక్కుతోచక పశువులకు వదిలేశాను. పంట కోస్తే కూలీల ఖర్చు భరించాలి కదా..? మార్కెట్‌కు తరలించేందుకు అదనపు ఖర్చు వస్తుంది. పంటను వదిలేస్తే నష్టం కొంతైనా తగ్గుతుంది. ప్రభుత్వం ఆదుకోకపోతే కోలుకోవడం కష్టం.

- కుక్కపల్లి శివశంకర్, కూడేరు

గిట్టుబాటు కల్పిస్తున్నాం..



టమోటాను గిట్టుబాటు ధరతో కొనాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో శుక్రవారం ఒక్క రోజే కిలో రూ.8 ప్రకారం వెయ్యి క్వింటాళ్ల టమోటాను కొని రైతు బజార్లకు సరఫరా చేశారు. జిల్లాలో సేకరించిన టమోటాను విజయవాడ, గుంటూరు రైతు బజార్లల్లో విక్రయిస్తారు. తద్వారా ఇక్కడి రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. టమోటా కొరత ఉన్న రాష్ట్రాల్లోనూ విక్రయించేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించారు. తద్వారా కిలో రూ.10 నుంచి రూ.15 వరకు రైతులకు అందుతుంది.

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

ప్రభుత్వమే కొంటుంది: పరిటాల సునీత



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

టమోటకు గిట్టుబాటు ధరలు లేవని రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత భరోసా ఇచ్చారు. ఆలమూరు సమీపంలో టమోటా పంటను ఆమె శుక్రవారం పరిశీలించారు. పెట్టుబడి, దిగుబడి, ధరల వివరాలను తెలుసుకున్నారు. గిట్టుబాటు కావడం లేదని, మార్కెట్‌లో 15కిలోల బాక్స్ రూ.50 నుంచి రూ.100 మధ్య పలుకుతోందని రైతులు ఆమెకు వివరించారు. కనీసం రూ.150 నుంచి రూ.250 మధ్య ధర ఉంటే తమకు గిట్టుబాటు అవుతుందని అన్నారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే మార్కెటింగ్, ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడారు. ఉత్తరాది నుంచి టమోటాలు అధికంగా మార్కెట్‌కు రావడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు ఆమెకు వివరించారు. దీంతో రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, ప్రభుత్వ గిట్టుబాటు ధరతో కొంటుందని ఆమె భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఉన్న రైతు బజార్లకు, ప్రాసెసింగ్ యూనిట్లకు జిల్లా టమోటాను పంపి, రైతులను ఆదుకుంటామని అన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది: దగ్గుపాటి

రైతులకు ఆదుకునే ప్రభుత్వం మాది. టమోటాకు గిట్టుబాటు ధరను అందిస్తున్నాం. కిలో రూ.8 ప్రకారం కొనుగోలు చేసి రైతు బజార్లకు సరఫరా చేయాలని సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ధరలు తగ్గినప్పుడు రైతులు భారీగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని గమనించి, సీఎం చంద్రబాబు గిట్టుబాటు ధర కల్పించారు.

ఆదుకుంటాం: పల్లె సింధూర



టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటాం. ప్రస్తుతం ధర లేక రైతులు నష్టపోతున్నారు. వారిని ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కిలో రూ.8తో టమోటాలను సేకరించేలా ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు అందాయి. రైతులెవరూ అధైర్యపడవద్దు.

బాక్సు రూ.50 అంటున్నారు..

ఎకరం పొలంతో రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి టమోటా సాగు చేశాను. దిగుబడి ఆశాజనకంగా ఉంది. దాదాపు 300 బాక్సుల వరకు టమోటాలు వస్తున్నాయి. కానీ మార్కెట్‌లో ధర పడిపోయింది. బాక్సు రూ.50 పలుకుతోంది. ఈ సొమ్ము కూలీలకు, బాడుగులకు సరిపోతుంది. అప్పులు చేసి పెట్టుబడులు పెడితే చివరికి అప్పులే మిగిలాయి.



- బోయ రామాంజనేయులు, కూడేరు

ఏమీ మిగలదు..



ఆశించిన స్థాయిలో టమోటా దిగుబడులు వచ్చాయి. కానీ ధర రోజు రోజుకూ తగ్గుతోంది. ఎకరానికి రూ.70 వేలు చొప్పున ఖర్చు చేసి 4 ఎకరాలు టమోటా పంటను సాగుచేశాను. నాలుగు రోజుల క్రితం 15 కేజీల బాక్స్ రూ.150 ఉండేది. ప్రస్తుతం రూ.125కి పడిపోయింది. దీంతో పలమనేరు మార్కెట్‌కు తరలిస్తున్నాం. ప్రస్తుత ధరకు అమ్మితే కూలీలకు, రావాణా ఖర్చులు, కమీషన్ పోనూ మాకు మిగిలేది ఏమీ ఉండదు. చత్తీస్‌ఘడ్ నుంచి మార్కెట్‌కు టమోటాలు ఎక్కువగా వస్తున్నాయి. అందుకే ధర పడిపోయింది. - సుధాకర్‌రెడ్డి, తిమ్మంపేట

ఫెఫ్టీ.. ఫెఫ్టీ ..!



ఓకే అంటే సబ్సిడీ లోన్ ఇప్పిస్తా..
నిరుద్యోగులకు మీ సేవ నిర్వాహకుడి ఆఫర్
నమ్మించి డబ్బు గుంజుతున్న మాయగాడు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'నీకు సబ్సిడీ లోన్ ఇప్పిస్తా. అందులో నాకు సగం ఇస్తావా? నాకు బ్యాంకు అధికారులే కాక, బీసీ కార్పొరేషన్, మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులు అందరూ బాగా తెలుసు. నేను ఎవరికి చెబితే వారికే లోన్ వస్తుంది'. అంటూ మండలంలోని ఓ గ్రామంలో ఉన్న ఓ మీసేవా కేంద్రం నిర్వాహకుడు నిరుద్యోగులను మోసం చేస్తున్నాడు. ఇప్పటికే చాలా మంది అతడి ఉచ్చులో పడినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీతో రుణాలను అందించేందుకు శ్రీకారం చుట్టింది. రూ. లక్ష, రెండు లక్షలు, ఐదు లక్షల వరకు యూనిట్‌ను బట్టి రుణం మంజూరు చేయనున్నారు. ఈక్రమంలో మండలానికి 47 యూనిట్లు మంజూరయ్యాయి. వీటి కోసం 322 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రుణ మంజూరు కోసం శుక్ర, శనివారాల్లో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 50 శాతం సబ్సిడీ కావడంతో ప్రతి ఒక్కరూ లోన్ కోసం తపిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న ఆ మాయగాడు దరఖాస్తుదారులను తన వలలో వేసుకుంటున్నాడు. లోన్ వచ్చిన తర్వాత సబ్సిడీ సొమ్ము చెరో సగం పంచుకుందామని చెబుతున్నాడు. అంతకంటే ముందు కొన్ని ఖర్చులు ఉంటాయి కాబట్టి కొంత సొమ్ము చెల్లించాలని వారితో రాబట్టుకుంటున్నాడు. ఒక్కొక్కరి నుంచి రూ. వెయ్యి, రూ.1500 వసూలు చేస్తున్నాడు. లోన్ వచ్చేలా చేస్తామంటే వెయ్యి ఏంటీ.. రెండు వేలు అయినా ఇస్తామంటూ కొంతమంది రెండువేల వరకు ఇస్తున్నట్లు సమాచారం. ఈ విషయం అధికారులెవరికీ తెలియకపోవడంతో మీ సేవ నిర్వాహకుడి ఆగడాలు రోజురోజుకి మితిమీరి పోతున్నాయి. అధికారులు స్పందించి అమాయకులు అతడి ఉచ్చులో పడి మోసపోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మాయమాటలు నమ్మొద్దు: విజయభాస్కర్, ఎంపీడీఓ, బొమ్మనహాళ్

సబ్సిడీ రుణాలను ఇప్పిస్తామని చెప్పే దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దు. బ్యాంకర్లు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరైతే అర్హత కలిగిన వారికే రుణాలు అందుతాయి. గ్రామాల్లో అమాయకుల అవసరాలను ఆసరా చేసుకొని ఎవరైనా వసూళ్లకు పాల్పడినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

అంతర్జాతీయ పోటీలకు యాడికి వాసి

యాడికి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లోని అబుదాబిలో నిర్వహిస్తున్న 47వ ఐఎస్‌సీ-అపెక్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన విజయ్ పాల్గొంటున్నాడు. స్థానిక కోటవీధికి చెందిన విజయ్ తండ్రి నాగేంద్ర ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. విజయ్‌ను తండ్రి చిన్నప్పటి నుంచి బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రోత్సహిస్తూ వచ్చారు. విజయ్ పలు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాడు. ప్రస్తుతం దుబాయ్‌లోని అబుదాబిలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఐఎస్‌సీ-అపెక్స్ మీట్‌లో పాల్గొనడానికి వెళ్లాడు. ఈనెల 24 వరకు నిర్వహించే పోటీల్లో భారత్ తరఫున పాల్గొననున్నాడు.



అబుదాబిలో బాల్ బ్యాడ్మింటన్ ప్లేయర్ విజయ్

28న ప్రతి స్కూల్‌లో సైన్స్ డే

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి స్కూల్‌లో ఈనెల 28వ తేదీన జాతీయ సైన్స్ డే వేడుక నిర్వహించాలని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్కూళ్లలోని ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీలు వినియోగించుకుని ప్రఖ్యాత శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, వారి ఆవిష్కరణలు, ఇస్రో సాధించిన విజయాలపై ఆ రోజు స్కూళ్లలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సైన్స్ క్విజ్, పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్, నాటికలు, 'ప్రపంచ గతిని మార్చిన సైన్స్ ఆవిష్కరణలు' అన్న అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా సైన్స్ దినోత్సవాలపై జిల్లా సైన్స్ అధికారి నివేదిక ఇవ్వాలని డీఈఓ ఆదేశించారు.

చీనీ టన్ను రూ. 22వేలు



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22,220 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 7వేలు, సరాసరి రూ. 12,500తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 130 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిర్దేహాళ్ గ్రామ సమీపాన 50 ఏళ్ల పైబడిన గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. హిర్దేహాళ్ సమీపాన బళ్లారి-రాయదుర్గం రోడ్డులో చర్చి వద్ద రెండురోజులుగా మతిస్థిమితం లేని వ్యక్తి సంచరిస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అటుగా పొలాలకు వెళ్లేవారు. ఆ వ్యక్తి పడి ఉండడాన్ని గమనించారు. అక్కడికి వెళ్లి చూడగా అతడు మరణించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి.. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలించారు. అతడు స్థానికుడు కాదని తెలిసింది. పోలీసులే ఖననం చేశారు.

బస్సు బోల్తా.. 20మందికి గాయాలు

గుత్తి ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు



బోల్తాపడిన బస్సు

గుత్తి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా జొన్నగిరి శివారులో ప్రైవేట్ బస్సు బోల్తా పడటంతో గాయపడిన 20మందిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందించారు. జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకుని ఈనెల 6న హిందూపురం నుంచి 44 మంది ప్రయాణికులు వివిధ పుణ్యక్షేత్రాల దర్శనం కోసం బయలుదేరారు. కుంభమేళా, మంత్రాలయం తదితర ప్రాంతాలను సందర్శించి తిరిగి హిందూపురం బయల్దేరారు. జొన్నగిరి సమీపంలోకి రాగానే బస్సు ముందు టైర్ పేలింది. దీంతో బస్సు అదుపు తప్పి పంటపొలాల్లో బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం విద్యుత్ నగర్‌కు చెందిన బస్సు డ్రైవర్ వినోద్‌కుమార్, అనంతపురం బ్రాహ్మణపల్లికి చెందిన తులసీ, కర్ణాటక రాష్ట్రం బసవనహళ్లికి చెందిన లక్ష్మయ్య, అనంతపురానికి చెందిన వన్నూర్‌స్వామి, కర్ణాటక బెంగళూరు రూరల్ తాలూకా గుండంగేరికి చెందిన నాగరాజాచారి, నాగలక్ష్మి, చంద్రశేఖర్, జయలక్ష్మి, ప్రేమమ్మ, కర్ణాటక రాష్ట్రం బలసముద్రానికి చెందిన ఆదెమ్మ, హనుమంతప్ప, దొడ్డబళ్లాపూర్‌కు చెందిన ఆదిశేషు, టుంకూరుకు చెందిన పుష్పావతి, అనంతపురానికి చెందిన ప్రమిళ, వన్నూర్‌స్వామి, మహాలక్ష్మి, ఉమాదేవి గాయపడ్డారు. క్షతగాత్రులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో తులసీ, పూర్ణాబాయి, ఆదిశేషు, లక్ష్మన్న పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది మండలంలోని దామాజిపల్లిలో సయ్యద్‌బాషా (40) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సయ్యద్‌బాషా తాగుడుకు బానిసయ్యాడు. వ్యసనాన్ని మానుకోలేక మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలోనే గురువారం రాత్రి ఇంటి సమీపంలోని పశువుల పాక వద్దకెళ్లాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో అతడి తండ్రి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో ఉరి నుంచి కిందకు దించి చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. సయ్యద్ బాషాకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాషా తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జాతీయ పారా అథ్లెటిక్స్‌లో
జిల్లాకు పతకాల పంట



జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లాకు చెందిన పారా అథ్లెట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పారా అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయస్థాయి పారా అథ్లెటిక్ పోటీలు నాలుగు రోజులపాటు నిర్వహించారు. నీలం పల్లవి షాట్‌పుట్‌లో రజతం, నీలం సంజయ్‌రెడ్డి షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో కాంస్య పతకాలు సాధించాడు. సాకే బాబు డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌లో రజతం కైవసం చేసుకున్నాడు. కురుబ సహన షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో రజతాలు సాధించింది. షేక్ అల్లావలీ 400 మీటర్ల పరుగులో రజతం, వెంకటేష్ కాంస్య పతకాలు సాధించారు. వారిని జిల్లాకు చెందిన పలువురు అభినందించారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యా ఏడాదికి ఆరో తరగతి ప్రవేశానికి ఏప్రిల్ 20న పరీక్షలు ఉంటాయని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూళ్లలోనే నిర్ణీత తేదీల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 24 నుంచి మార్చి 31వతేదీ వరకూ నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులు ఉపయోగించి పేమెంట్ గేట్ వే ద్వారా పరీక్షల ఫీజు చెల్లించవచ్చన్నారు. ఫీజు చెల్లించిన తర్వాత వచ్చే జనరల్ నంబర్ ఆధారంగా www.cse.ap.gov.in, www.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

ముగ్గురు వైద్యుల తొలగింపు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలు చూపి ఏళ్లుగా విధులకు డుమ్మా కొడుతున్న ప్రభుత్వ వైద్యులపై సర్కారు కొరడా ఝుళిపించింది. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది డాక్టర్లు ఏళ్ల తరబడి డ్యూటీలకు రావడంలేదు. దీనిపై లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. విచారణ చేసిన లోకాయుక్త అలాంటి డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఏళ్ల తరబడి సమాచారం ఇవ్వకుండా డ్యూటీలకు రానివారి సమాచారం సేకరించారు. మొత్తం 55మంది డాక్టర్లున్నట్లు తేలడంతో వారందరినీ సర్వీస్ నుంచి తొలగిస్తూ శుక్రవారం రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అందులో అనంత మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు డాక్టర్లు ఉన్నారు. డాక్టర్ సునీత (న్యూరాలజీ), డాక్టర్ భరత్‌కుమార్ (సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ), డాక్టర్ విజయవాణి (పీడియాట్రిక్) మూడేళ్లుగా డ్యూటీలకు రావడంలేదు. ఆ ముగ్గురు డాక్టర్లు తొలగింపు జాబితాలో ఉన్నారని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు.

న్యూస్ బాక్స్

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తనకల్లు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శుక్రవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి రైతులు క్షీరాభిషేకం చేశారు. టమోటా ధరలు పడిపోయి రైతులు పొలాల్లో వదిలేస్తున్నారని, ఇలాంటి సమయంలో రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వమే టమోటాలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. టీడీపీ కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, దేశాయి ప్రభాకర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, దస్తగిరి, మహబూబ్‌బాషా, కోటిరెడ్డి, తోట సరోజమ్మ పాల్గొన్నారు.

కూరగాయలు, ఆకుకూరల పంపిణీ



బాలింతకు కూరగాయలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

తనకల్లు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పంపిణీ చేపట్టారు. ఎంపికచేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శుక్రవారం కోటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు కూరగాయాలు, ఆకుకూరలను ఎంపీడీఓ రెడ్డెప్ప అందించారు. ఆయన మాట్లాడుతూ.. వీటిని తినడం ఆరోగ్యకరంగా ఉం టారని అన్నారు. సక్షం కింద ఎంపిక చేసిన గ్రామాల్లో మంచి ఫలితాలు వస్తున్నట్లు సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ తెలిపారు. మరిన్ని కేంద్రాల్లో ఈకార్యక్రమం అమలుచేయడానికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. కార్యదర్శి ఫాతిమా, అంగన్‌వాడీ కార్యకర్తలు సాయిలక్ష్మీ, భాగ్యమ్మ, ఆయాలు మాధవి, మంజుల పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ధర్మవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు జిల్లా క్షయవ్యాధి నివారణ విభాగం ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ మల్లికార్జున, నాగేంద్ర అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి నివారణ వారోత్సవాలలో భాగంగా స్థానికప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. క్షయవ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు, మందులు, క్షయవ్యాధితో బాధపడుతున్న రోగులకు చికిత్స సమయంలో ప్రతినెలా ప్రభుత్వం పౌష్టికాహారం కోసం రూ.1000 మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గాయత్రిబాయి, ధర్మవరం అర్బన్ హెల్త్ కమ్యూనిటీ ఆర్గనైజర్ లక్ష్మీనారాయణ, ఏఎన్ఎం, ఆశావర్కర్, టీబీ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో మంచి ఉత్తీర్ణత సాధించాలి




ఉద్యోగ విరమణ పొందిన ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌ఫలితాల్లో ఈ ఏడాది కూడా మంచి ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషిచేయాలని అనంతపురం ఆర్ఐఓ వెంకటరమణనాయక్ సూచించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి గత నెల 31వ తేదీన పదవీవిరమణ పొందారు. దీంతో శుక్రవారం ఆయనకు ఆత్మీయ సభను కళాశాల చైర్మన్ బండివేణుగోపాల్ ఏర్పాటు చేశారు. సభకు అనంతపురం ఆర్ఐఓ వెంకటరమణనాయక్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మీ, పల్లెంవేణుగోపాల్ హాజరయ్యారు. ఆర్ఐఓ మాట్లాడుతూ కళాశాలలో 13 సంవత్సరాలుగా దాతల సహాయంతో విద్యార్థులకు భోజనం అందిస్తుండటం సంతోషించతగ్గ విషయమన్నారు.

కాటకోటేశ్వర ఉత్సవాలకు విఘాతం కలిగిస్తే చర్యలు

తాడిమర్రి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటకోటేశ్వరస్వామి ఉత్సవాలు 25, 26 తేదీలలో నిర్వహిస్తున్నారని, అసాంఘిక శక్తులు విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణవేణి హెచ్చరించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ ఉత్సవాల ఏర్పాట్లపై శనివారం ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం ఉంటుందన్నారు. మండలంలో ఇప్పటికి 50 మందికిపైగా బైండోవర్ చేశామని, చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి, దాడితోట గ్రామాలకు చెందిన మరికొంతమంది అనుమానితులను బైండోవర్ చేసే అవకాశం ఉందన్నారు.

ఈ-పంట నమోదును పకడ్బందీగా చేపట్టాలి



వేరుశనగ దిగుబడిని పరిశీలిస్తున్న ఆర్డీఓ సువర్ణ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈపంట నమోదును వ్యవసాయ శాఖ సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ సువర్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని ఇనగలూరు గ్రామంలో సర్వేనెంబర్ 671-ఏలో నరసింహులు సాగుచేసిన కె-6 వేరుశనగ పంటను పరిశీలించారు. నమోదు వివరాలను ఏఈఓ ఓవెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగుచేసిన పంటల నమోదు సక్రంగా చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ అనంతచారి, వీఆర్ఓ రమణప్ప, వీఏఏ రెడ్డెప్ప పాల్గొన్నారు.



నాడు.. ఆస్పత్రికి వెళ్లే దారి దుస్థితి..



నేడు.. సీసీ రోడ్డు నిర్మాణం

బాగుపడిన ఆస్పత్రి రహదారి

- రూ.20 లక్షలతో మరమ్మతులు, రహదారుల నిర్మాణం
- ఏళ్లనాటి పనులకు మోక్షం
- మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వందపడకల ప్రభుత్వాసుపత్రిలో మౌలిక వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయింది. ప్రధానంగా ఆసుపత్రిలోకి వెళ్లేందుకు ప్రధానరహదారి పూర్తిగా కంకరతేలింది. రోగులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆసుపత్రిలో భవనాల పైపెచ్చులు ఊడిపోవడం, ఎలక్ట్రిక్ వస్తువులు పాడైపోవడంతో ఉన్న అరకొర సదుపాయాలతోనే రోగులకు సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం రాగానే 8 నెలల్లోనే ఆసుపత్రికి మహర్దశ పట్టింది. రోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటికి వైద్యవిధానపరిషత్ ద్వారా రూ.20లక్షల నిధులు మంజూరు చేయించి మౌలిక వసతుల కల్పన కోసం పనులు చకచక జరుగుతున్నాయి. సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తికావడం, ఇతర పనులు చేస్తుండటంతో ఆసుపత్రికి వచ్చే రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాడు ఐదేళ్ల పాలకులు ఆసుపత్రి వైపు కన్నెత్తిచూడలేదని, కనీసం నడిచేకి రోడ్డుకూడా సరిగా లేకపోయిందని, నేడు ఈ ప్రభుత్వంలోనైనా వసతులు కల్పించి రోగులకు ఇబ్బందిలేకుండా చేయడం సంతోషంగా ఉందని పలువురు చెబుతున్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వద్దు

● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి రాకూడదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గడిచిన 8 నెలల్లో అభివృద్ధి, సంక్షేమంతోపాటు, గతంలో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలను కూడా వెలికి తీశామన్నారు. తప్పు చేసినవారికి దండన తప్పదన్నారు. గత వైసీపీ పాలనలో కొంతమంది నాయకులు ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే, మరికొంతమంది ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతూ ప్రభుత్వ పట్టాలను దళారులతో విక్రయించి, సొమ్ము చేసుకున్నారన్నారు. వారు చేసిన అక్రమాలను వెలికి తీస్తూనే ఉంటామన్నారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అసరమైన సౌకర్యాలు కల్పిస్తామని, మెరుగైన వైద్య సేవలు అందించడానికి నిధులు సమకూర్చుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాటుసారాను నిర్మూలించేందుకు నవోదయం పేరుతో చేపట్టిన కార్యక్రమ పోస్టర్లను ఎమ్మెల్యే విడుదల చేశారు. అలాగే ఆర్టీసీ డిపోకు నూతనంగా వచ్చిన ఐదు బస్సులను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. డిపో మేనేజర్ మైనోద్దీన్, ఆసుప్రతి కమిటీ సభ్యులు వేణుగోపాల్, రెడ్డిబాషా, లక్ష్మణ్, డాక్టర్ హుస్సేన్, ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

వాటర్‌షెడ్‌తోనే రైతులకు ప్రయోజనం

నంబులపూలకుంట: రైతులకు వాటర్ షెడ్ ఎంతోఉపయోకరమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమను కరువు ప్రాంతంగా భావించే వాటర్‌షెడ్ యాత్ర చేపట్టామన్నారు. మండలంలో ఎక్కువగా వర్షాలు కురుస్తాయన్నారు. అందువల్లే రాష్ట్రంలోనే వాటర్ షెడ్ కార్యక్రమాన్ని ప్రారభించడం ఆనందంగా ఉందన్నారు. వాటర్‌షెడ్ చైర్మన్ మహబూబ్‌బాషా, సర్పంచ్ అంజనమ్మ, ఎంపీపీ రాము, ఏపీడీ సుధాకర్‌రెడ్డి, చైతన్య కృష్ణచైతన్య, రమేష్‌బాబు, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ అంజనప్ప, ఎంఈఓ సుబ్బిరెడ్డి, హెచ్‌ఎం శిరీషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కొత్తచెరువు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్ జడ్పీ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సూర్యనారాయణ రెడ్డిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ కిష్టప్ప శుక్రవారం తెలిపారు. సూర్యనారాయణ రెడ్డి చెక్‌బౌన్స్ కేసులో అరెస్టయి అనంతపురం జిల్లా జైలులో ఉన్నారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతనిని సస్పెండ్ చేశామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తుమ్మల పర్వీన్‌షామీర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్టు విల్సన్ తెలిపారు. సమావేశానికి అధికారులు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండలకోఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఆమె కోరారు.

8న జాతీయ లోక్ అదాలత్

ధర్మవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టులో మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు, పోలీస్, బ్యాంకు రుణం కేసులు ఉన్నవారు లోక్‌అదాలత్ ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి కోరారు.

నేడు బీడీ కార్మికుల సమావేశం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీడీ కార్మికుల యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం శనివారం కదిరిలో నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకులు జగన్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఓబులు హాజరవుతారన్నారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వారి సంక్షేమం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా కాలనీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడినట్లు 108సిబ్బంది తెలిపారు. సిద్దన్నగారిపల్లికి చెందిన గోపాల్, అతని అక్క అరుణమ్మ, లల్లి ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా కస్తూర్బా కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

గుడిసె దగ్ధం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి బ్రాహ్మణపల్లిలో గురువారం రాత్రి నిప్పంటుకుని గుడిసె దగ్ధమైంది. శుక్రవారం గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన క్రిష్టప్ప గ్యాస్‌స్టౌలు మరమ్మతులు చసుకుని జీవనం సాగించేవాడు. గురువారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో గుడిసెకు నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయిందన్నారు. గుడిసెలోని దుస్తులు, నిత్యవసర వస్తువులు కాలిబూడిదైనట్లు చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.20వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు. ఘటనా స్థలాన్ని వీఆర్ఓ ఉదయ్‌కుమార్ పరిశీలించారు.

నాపై ఆరోపణలు నిరాధారం: మాజీ మంత్రి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నాపై సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అవుతున్న కథనాలు నిరాధారమైనవని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం ప్రకటనలో స్పష్టం చేశారు. 30 ఏళ్లుగా క్రమశిక్షణ కలిగిన టీడీపీలో కుటుంబసభ్యుడిగా పనిచేస్తున్నానని పార్టీకి అప్రతిష్ట కలిగే విధంగా ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదన్నారు. పార్టీ అభ్యర్థులకు నమ్మకద్రోహ కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. కదిరి, ముదిగుబ్బలో ఉన్న తన కళాశాలలకు సంబంధించిన ఆస్తులను బైలాస్‌కు అనుగుణంగా అమ్మడం, కొనడం జరగిందన్నారు. ఇందులో ఎలాంటి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేయలేదన్నారు. టీడీపీ కుటుంబ సభ్యుడిగా, నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తల కోసం ప్రాణం ఉన్నంత వరకు పనిచేస్తానన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడే సమస్యేలేదని పల్లె అన్నారు.

గండెపోటుతో ఇటలీ దేశస్థుడి మృతి

కొత్తచెరువు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని ఈడిగ వీధికి చెందిన రేవరేటి సలోమి ప్రమీలారాణిని ఇటలీ దేశానికి చెందిన గబ్రీలే రోవేరాటి 2008లో వివాహం చేసుకొని నివాసం ఉంటున్నాడు. గబ్రీలే రోవేరాటి శుక్రవారం గండెపోటుతో మృతి చెందినట్లు ఆయన భార్య ప్రమీలారాణి పోలీసులకు తెలిపారు. గబ్రీలే రోవేరాటి గతకొంత కాలంగా అనారోగ్యానికి గురై అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ల్యాప్‌టాప్‌లో హెడ్‌ఫోన్స్ పెట్టుకొని సినిమా చూస్తూ కింద పడిపోయాడు. ఆయన్న చికిత్స నిమిత్తం భార్య కుటుంబ సభ్యులతో కలసి పుట్టపర్తి సూపర్ స్పెషాలటీ ఆస్పత్రికి తరలించారు. అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేపుకొని ఇటలీ ఎంబసీకి సమాచారం అందించారు.

తలనీలాలు ఇచ్చేందుకు వచ్చి కానరాని లోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి, ముగ్గురికి గాయాలు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కుమార్తె తలనీలాలు సమర్పించేందుకు వచ్చిన ఆ కుటుంబంలో ఒక్కసారిగా చీకట్లు అలముకున్నాయి. తిరుమలకు కారులో వెళుతుండగా ప్రైవేటు బస్సు ఢీకొంది. మూడేళ్ల బాలిక మృతిచెందింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం ఓబులదేవిచెరువు గ్రామానికి చెందిన వేణుగోపాల్, అశ్విని దంపతులు వారి మూడేళ్ల కుమార్తె హరిప్రియ, మరో మహిళతో కలిసి గురువారం శ్రీకాళహస్తికి వెళ్లారు. అక్కడ శివయ్యను దర్శించుకుని అర్ధరాత్రి తిరుమలకు కారులో బయలుదేరారు. జాతీయ రహదారి నుంచి ఆర్సీపురం సర్కిల్లో తిరుపతికి వచ్చేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో బెంగళూరు నుంచి విశాఖపట్నంకు వెళుతున్న ప్రైవేటు బస్సు వేగంగా వచ్చి వీరి కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో హరిప్రియ అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవింగ్ చేస్తున్న వేణుగోపాల్ వెనుక సీట్లో కూర్చొని ఉన్న ఆయన భార్య అశ్విని, మరో మహిళ గాయాలతో బయటపడ్డారు. కారులో చిద్రమైన హరిప్రియ మృతదేహన్ని స్థానికులు బయటకు తీశారు. మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు బోరున విలపించారు. 'దేవుడా ఇదేమి ఘోరం' అంటూ అర్ధరాత్రి నడిరోడ్డుపై ఆ తల్లిదండ్రుల ఆక్రందనలు అటుగా వెళ్లే వారితో కన్నీరు పెట్టించాయి. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కుమార్తె మాంసపు ముద్దలా మారడాన్ని చూసిన ఆ తల్లి గుండెలవిసేలా రోదించడం కలిచివేసింది. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. తిరుపతి రూరల్ పోలీసులు బస్సు డ్రైవరు గురుశాంత్‌ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



కదిరి: హరీష్ పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు

ధర్మవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ బాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ గాంధీ, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

నంబులపూలకుంట : మండలంలోని గూటిబైలు జడ్పీ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవమిన్న ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు శాంతమ్మ, ఉపాధ్యాయులు నాగరాజునాయక్, చిన్నా, మహబూబ్‌బాషా, చాంద్‌బాషా, స్రవంతి పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: మండలంలోని ఎరుకులవాండ్లపల్లి వద్ద ఉన్న హరీష్ పాఠశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్ఞానసాయి పాఠశాలలో భారత మాత, సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వశిష్ట, శ్రీవిజ్ఞాన్ సీబీఎస్‌సీ, విజ్ఞాన్, రైయిన్‌బో పాఠశాలలో నిర్వహించారు. కరస్పాండెంట్లు ఫకృద్దీన్, మస్తాన్, మోహన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, జయసింహారెడ్డి, పాల్గొన్నారు.



నంబులపూలకుంట: గూటిబైలు పాఠశాలలో..

బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి

● సీఎస్‌డీటీలకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి సవిల్ సప్లై తహసీల్దార్లు (సీఎస్‌డీటీలు) తనిఖీలు ముమ్మరం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ భవనంలో జిల్లా ప్రజాపంపిణీ వ్యవస్థపై జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి సీఎస్‌డీటీలు క్షేత్రాస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందిస్తున్న చౌకబియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల తుకాల్లో ఎలాంటి మోసాలు జరగకుండా నిరంతరరేషన్ దుకాణాలు పర్యవేక్షించాలన్నారు. ప్రతి సీఎస్‌డీటీ నెలకు ఒకసారి వారి పరిధిలోని 20 రేషన్ దుకాణాలు తనిఖీ చేసి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలను తరచూ తనిఖీ చేసి, ప్రజలనుంచి అభిప్రాయాలు తీసుకుని, ఎక్కడా లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే ఎండీయూ వాహనాలను సీఎస్‌డీటీలు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని ప్రజా పంపిణీ వ్యవస్థ రాష్ట్రస్థాయిలో దిగువన ఉందని, ప్రథమస్థానంలోకి తీసుకురావడానికి అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, డీఎం అశ్వత్థనాయక్, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, ఆనంద్‌లతోపాటు 32మండలాల సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా శనివారం ఉదయం 10.30 నుంచి ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మునిసిపాలిటీ ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని అన్నారు. కార్యక్రమానికి హాజరు కావాలిన వివిధ శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



తాడిమర్రి మండలం పిన్నదరిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, ప్రజలు

తాడిమర్రి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ నాయకులు ముసుగు మధు, జింకా చలపతి డిమాండ్ చేశారు. మండలంలోని పిన్నదరి గ్రామంలో ఇళ్లులేని పేదలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం, ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారన్నారు. దానిని వెంటనే అమలు పరచాలన్నారు. కమతం కాటమయ్య, రామకృష్ణ, వెంకటేశ్, లక్ష్మీనారాయణ, నాగభూషణ పాల్గొన్నారు.

నంబులపూలకుంట: ఇళ్లులేని నిరుపేదలకు మూడుసెంట్లు స్థలం ఇవ్వాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు శుక్రవారం సీపీఐ నాయకులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గత వైసీపా పాలనలో నివాసానికి పనికి రాని చోట పట్టాలిచ్చారన్నారు. నాయకులు సూర్యనారాయణరెడ్డి, జీ. రమణ, ఆదిలక్ష్మమ్మ, గంగిశెట్టి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

వర్షం నీరు వెళ్లేందుకు కాలువ ఏర్పాటు



ప్రియాంకనగర్‌లో కాలువను తవ్విస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నుంచి పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన టీవీఎస్ షోరూం వద్ద వర్షాలు వచ్చినప్పుడు నీరు నిల్వ ఉంటోంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులుపడేవారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, 25వ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి చొరవ తీసుకుని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌తో చర్చించారు. వారితోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేశవ ఎక్సవేటర్ సహాయంతో చెరువులోకి నీరు వెళ్లేందుకు కాలువను తవ్వించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. సచివాలయ అడ్మిన్ సాయి, ప్లానింగ్ సెక్రటరీ పుష్పరాజ్, ఇంజనీరింగ్ సెక్రటరీ సరిత పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్ల వేతనాల విడుదలపై హర్షం

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇమామ్ మౌజన్లకు వేతనాలు విడుదల చేయడంపై మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ మహమ్మద్‌రఫీ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం ఆయన తన కార్యాలయలో మాట్లాడుతూ రానున్న రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.45 కోట్లు ఇమామ్, మౌజన్లకు వేతనాలు విడుదల చేసి కూటమి ప్రభుత్వం శుభవార్త తెలిపిందన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకుందన్నారు. నిధులు విడుదల చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు.

జమ్మలమడుగు ఎమ్మెల్యేని కలిసిన ముస్లింలు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి శుక్రవారం పుట్టపర్తిలోని ఓ సమావేశానికి వెళుతూ మార్గమధ్యలో ముదిగుబ్బ మండల కేంద్రంలోని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్ నివాసానికి వెళ్లారు. నాయకులు ఎమ్మెల్యేని, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డిలను శాలువాలతో సన్మానించారు. హైదర్‌వలి, నిస్సార్ అహ్మద్, షబ్బీర్, మౌలాసాబ్, ముస్తాక్ పాల్గొన్నారు.

28 లోపు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

ముదిగుబ్బ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు 28వ తేదీలోపు తప్పనిసరిగా విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని ఏడీఏ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం ముదిగుబ్బలోని 3, 4 సచివాలయాలను పరిశీలించి రైతు విశిష్ట సంఖ్య రిజిస్టర్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారి లక్ష్మీనరసింహులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రీకాట్-బి మిల్లు వద్ద ఏఐటీయూసీ ధర్నా



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

పరిగి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కొడిగెనహళ్లి పంచాయతీలో గల ప్రీకాట్‌బీ మిల్లు ఎదుట ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం దర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ 1983లో ఏర్పడిన ప్రీకాట్‌బీ మిల్లు ఎంతో ఘనమైందని ఎందరో కార్మికుల కుటుంబాలను పెంచి పోషించి ఉన్నత స్థానానికి తీసుకెళ్లిన ఘనత ఈ మిల్లుకు ఉందన్నారు. ఎంతోమంది కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న మిల్లును మూసివేస్తున్నారన్నారు. ప్రస్తుతం మిల్లులో పనిచేస్తున్న కార్మికులను దృష్టిలో ఉంచుకుని మిల్లు యాజమాన్యం మిల్లును కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహమూర్తి, కమల్‌బాష పాల్గొన్నారు.

పనిచేయని ఫోన్‌లు.. వినియోగదారుల ఆందోళన

గోరంట్ల,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):పట్టణంలో నెలరోజులుగా జియో, బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సెల్‌ఫోన్లు సరిగా పనిచేయకపోవడంతో వినియోగదారులు గోరంట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళనచేశారు. అనంతరం తహసీల్దార్ లేకపోవడంతో విఆర్‌ఓ అశోక్‌కు వినతిపత్రం అందచేశారు. సంబంధిత నెట్‌వర్క్ సంస్థలపై చర్యలు తీసుకుని, సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు.

ప్రథమ కౌన్సిల్‌సభ విజయవంతం చేద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

పెనుకొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మార్చి2న ధర్మవరంలో నిర్వహిస్తున్న ప్రథమ కౌన్సిల్‌సభను విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో జిల్లాసీపీఎస్ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు యాదవ్, గౌరవాధ్యక్షులు ప్రభాకర్, మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులుగా మనమందరం కౌన్సిల్ మహసభకు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ, ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాచి, పఠాన్, ఎమ్మెల్యే, మంత్రులు హాజరవుతారన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు.

ఇంటర్ పరీక్షాకేంద్రాల పరిశీలన

అగళి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ సుబ్బారావు, ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు తనిఖీ చేశారు. త్వరలో ఇక్కడ అగళి, రొళ్ల మండలాలకు సంబంధించిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో భాగంగా మోడల్ పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి వసతులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జాఫర్, ఉపాధ్యాయులు మంజునాథ్, తదితరులు ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి

మడకశిరరూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుండమల గ్రామంలో ఉన్న కేజీబీవీని ప్రత్యేకాధికారి కృష్ణనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక వసతులు, భోజన సదుపాయాలు, విద్యాబోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు తీసుకురావాలన్నారు. ముందస్తు సమాచారం ఇచ్చినా ప్రిన్సిపాల్ లేకపోవడంతో అసహనం వ్యక్తంచేశారు. ఆయన వెంట ఎంఈఓ భాస్కర్ ఉన్నారు.

ఘనంగా కళాశాల ఫేర్‌వెల్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

గోరంట్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్‌డేని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు కలిసి సరస్వతి దేవికి పూజలు చేశారు. విద్యార్థులు మార్చి నెలలో జరిగే పరీక్షలకు బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని ,భవిష్యత్‌లో ఉన్నత స్థితికి చేరాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం విద్యార్థులను కోరారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మీ, అధ్యాపకులు ఆజాద్, జూనిద్‌బాషా, కవిత, బాల మోహన్, అరవింద్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

3న రైతు సదస్సు

సోమందేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):మార్చి3న హిందూపురంలో జరిగే రైతు సదస్సును జయప్రదం చేయాలని ఏఐకెకెఎంఎస్ రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కేతగానిచెరువులో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు సరైన గిట్టుబాటుధర లేదన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు 40టీఎంసీల నీటిని కేటాయించాలన్నారు. అలాగే రైతుల బోర్లకు స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను వెంటనే ఆపాలన్నారు. అనంతరం గోడపత్రికలు విడుదల చేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పెనుకొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని మండల ప్రత్యేక అధికారి పద్మమ్మ సూచించారు. శుక్రవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆమెతోపాటు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తరలిపోతున్న వృక్ష సంపద

- ప్రభుత్వం మారినా మారని అధికారుల తీరు
- అడవి అంతరించిపోతున్నా పట్టించుకోని వైనం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలో ఐదు మండలాల చుట్టూ అటవీ ప్రాంతాలు విస్తరించి ఉన్నాయి. అందులో పచ్చనిచెట్లను కాపాడాల్సిన అధికారులు పర్యవేక్షణ లోపం వల్ల అటవీ ప్రాంతాన్ని ఆదాయవనరుగా మార్చుకున్నారు. కర్ణాటక సరిహద్దు దగ్గర ఉండంతో పచ్చనిచెట్లను నరికి అక్కడికి తరలిస్తున్నా అధికారులు మాత్రం మిన్నకుండి పోతున్నారని మడకశిర ఇన్‌ఛార్జి ఫారెస్టు అధికారిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సామిల్ నిర్వహిస్తున్న పలువురు తెలుగుదేశం పార్టీకి చెందినవారికి లైసెన్స్‌లు సైతం రిన్యూవల్ చేయక, అడ్డు తగులుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మడకశిర పట్టణంలో సామిల్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తి వద్ద రూ.1.06లక్షలు నగదు అందుకొని చివరకు అందులో తనకు రూ.60వేలు మాత్రమే ఇచ్చినట్లు చెప్పాలని ఒత్తిడి తెచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల పనిముట్లకు అవసరమైన చెట్లను నరుక్కోవడానికి అనుమతి కోసం వెళ్లినా చేతివాటం ప్రదర్శిస్తున్నారని అంటున్నారు. ఈనెలలో జరిగిన స్పందనలో కలెక్టర్‌కు సైతం బాధితులు ఫిర్యాదు చేశారు. సీఎఫ్‌ఓకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇంతవరకు విచారణ జరపలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చనిచెట్లు కర్ణాటక ప్రాంతమైన పావగడ, మిడిగేశి, హొసకెర, రొంటవాళ, బడవణహళ్లి ప్రాంతాలకు వెళుతున్నా పోలీసులు నామ మాత్రపు చర్యలు తీసుకొంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో వృక్షసంపద క్రమేపీ అంతరిస్తోంది. ఇప్పటికైనా అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అటవీ సంరక్షణ గురించి గాలికి వదిలేస్తే ఎలాగని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ట్రాక్టర్‌లో కర్ణాటకకు తరలివెళుతున్న కలప దుంగలు

ఎవరి వద్దా డబ్బు తీసుకోలేదు: కుళ్లాయప్ప, ఫారెస్టు అధికారి

నాపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. చలానా డబ్బులు ఎవ్వరివద్దా తీసుకోలేదు. ఎక్కడా చేతివాటం సైతం ప్రదర్శించలేదు. కర్ణాటకకు తరలివెళుతున్న కలపను సైతం అడ్డుకొని, జరిమానాలు విధిస్తున్నాం. భవిష్యత్తులో మరింత శ్రద్ధపెట్టి చెట్లను నరికి తరలించకుండా చూస్తాం.

చలానా చెల్లించినా ఆగని ఒత్తిడి



మడకశిర అటవీశాఖ అధికారి కుళ్లాయప్పకు సామిల్ లైసెన్స్ రెన్యూవల్ కోసం రూ.1.06లక్షలు నగదు ఇచ్చా. చివరకు రూ.60వేలు మాత్రమే అందిందని చెబుతూ అంతే మొత్తం చెల్లించినట్లు ఉన్నతాధికారులకు చెప్పాలని ఒత్తిడి తెస్తున్నారు. లైసెన్స్ రెన్యూవల్ చేయకుండా అడ్డుపడుతున్నారు.

వీరభద్రప్ప, సామిల్ నిర్వాహకుడు

డబ్బు చెల్లించడానికి వెళితే మాట మారుస్తున్నారు



నాకు సంబంధించిన చెట్లను నరుక్కొనేందుకు అనుమతికోసం చలానా డబ్బులు చెల్లించినా మాట మారుస్తున్నారు. మరోసారి చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈవిషయమై స్పందన కార్యక్రమంలో సైతం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

హనుమంతేగౌడ్, హరేసముద్రం

రూ.68 కోట్లతో పురం మునిసిపల్ బడ్జెట్

- పన్నుల ద్వారా వచ్చేది రూ.48.86కోట్లు
- కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా 10.75కోట్లు
- మొత్తం రూ.59.61కోట్లతో అంచనా

హిందూపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హిందూపురం మునిసిపాలిటీకి సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.68కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. ఇందులో మునిసిపాలిటీ పన్నుల ద్వారా వచ్చేది రూ.48.86 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా 10.75కోట్లు వస్తుందని మొత్తంగా రూ.59.61కోట్లు ఉంటుందని అంచనావేశారు. ఇంకా సుమారు రూ.8.5కోట్లు లోటు ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మునిసిపాలిటీకి ఆస్తిపన్ను ద్వారా రూ.15కోట్లు, ఖాళీజాగాలు, పన్నుల రూపంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రూ.8కోట్లు, మార్కెట్ లీజు, గదుల అద్దె తదితరవాటి నుంచి రూ.7కోట్లు, నీటి పన్నుగా రూ.3కోట్లు, టౌన్‌ప్లానింగ్ నుంచి రూ.6.5కోట్లు, ట్రేడ్ లైసెన్స్ ద్వారా రూ.50లక్షలు, ఇతరత్రా ఫీజుల ద్వారా మరో రూ.5కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం మునిసిపాలిటీలకుఇచ్చే రూ.1.8కోట్లు మొత్తంగా ఆదాయం రూ.48.86కోట్లు ఉంటుందని నిర్ధారించారు.

కేటాయింపులిలా..

ఇందులో పొరుగు సేవల ఉద్యోగుల వేతనాల కోసం రూ.12కోట్లు, విద్యుత్ చార్జీలు రూ.3కోట్లు, నీటి పథకాల నిర్వహణ, శానిటేషన్ కోసం మరో రూ.25కోట్లు ఖర్చుచేయాల్సి ఉంటుందని మొత్తంగా రూ.40.71కోట్లు ఖర్చవుతుందని అంచనావేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 10.75కోట్లకు అదనంగా మునిసిపాలిటీ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించారు. హిందూపురం మునిసిపాలిటీ అభివృద్ధి కోసం మొత్తంగా 27.37కోట్లు ఖర్చుచేయనున్నట్లు పేర్కొన్నారు.



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

మునిసిపల్ అభివృద్ధికి అందరి సలహాలు తీసుకుంటాం

హిందూపురం మునిసిపల్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమేష్ ఆధ్వర్యంలో మొదటిసారిగా శుక్రవారం సమావేశం జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ మునిసిపల్ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరి సలహాలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. మునిసిపాలిటీలో రూ.120కోట్లతో అండర్ డ్రైనేజీ, రూ.92కోట్లతో రోడ్లపనులు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు. ముఖ్యంగా గత యేడాదికంటే ఈ యేడాది పన్నులు వసూళ్లలో అధికారులు కష్టపడి రెవెన్యూ పెంచారన్నారు. మునిసిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయిలు వెంటనే వసూలు చేయాలన్నారు. మునిసిపల్ అభివృద్ధికి ఏఏ మార్గాలున్నాయో అధికారులు గుర్తించాలని కోరారు. మునిసిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ సముదాయంలో భవనాలు ఖాళీగా ఉన్నాయని అక్కడికి బ్యాంకులు వచ్చేలా ప్రయత్నిస్తామన్నారు. అంతేకాక త్వరలోనే బెంగళూరు రోడ్డు విస్తరణ ఉంటుందని దీంతో ఆ రహదారిలో ఉన్న బ్యాంకులను మార్కెట్ సముదాయ భవనంలోకి తీసుకువస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు వసూళ్లలో నిర్లక్ష్యం లేదని ఇప్పటికే కొన్ని కార్యాలయాలకు రెడ్‌నోటీసు ఇచ్చామన్నారు. పట్టణంలో గ్యాస్‌లైన్ వేసే నిర్వాహకుల నుంచి రూ.1.30కోట్లు జమచేయడం జరిగిందని ఇంకా పనులున్నాయని వాటి మరమ్మతులకు కూడా వారి నుంచి రాబట్టడం జరుగుతుందన్నారు.

వైసీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవన యజమానులపై ఇప్పటికే 38చార్జిషీట్లు వేయించామని వారి నుంచి రూ.3కోట్లు వస్తుందన్నారు. అయితే ఏసీగ్రాంట్‌కు సంబంధించి సింగిల్ టెండర్ వేశారని దానికి ఆమోదం తెలుపమని డీసెంట్ నోటీసు చైర్మన్, కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా 7వ వార్డు కౌన్సిలరు నసీరాబాను మాట్లాడుతూ నాలుగేళ్లుగా డ్రైనేజీ పనులు చెప్పినా చేయలేదన్నారు. అయితే ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో మూడు రోజుల్లో సమస్య పరిష్కారమైందని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతుండగా మునిసిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, ఫ్లోర్ లీడర్ ఆసిఫ్‌లు వ్యంగ్యంగా మాట్లాడారు. దీంతో ఆమె క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా ఇరుపార్టీల కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆఖరిలో అజెండాలోని అంశాలను ఆమోదిస్తున్నట్లు సభ్యులు ప్రకటించారు.



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్

సంపన్నులకే ఉపాధి పనులా?

పావగడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధిహామీ పథకం పనులు నేడు ధనవంతులకే కల్పించడంతో పేదలకు తీరలేని కష్టాలు వస్తున్నట్లు కడపల కెరె గ్రామానికి చెందిన ప్రజలు శుక్రవారం ఈఈఓ ముందు కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఆగ్రామానికి చెందిన సీతారామ చెరువులో పూడికతీత పనులకు గ్రామ ప్రజలు కోటగుడ్డం గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకోవడానికి వెళ్తే ఇప్పుడు పనులు లేవని పీడీఓ చెప్పడంతో ఆ ప్రజలు ఆగ్రహానికి గురయ్యారు. ఆ గ్రామంలోని వారు రాజకీయ అండదండలున్న వ్యక్తులకు పనులు కల్పిస్తుంటే తమకు మాత్రం ఎందుకు లేవని వారు ప్రశ్నించారు. దీనిపై ఈఓ జానకీరామ్ చొరవ తీసుకుని ఏప్రిల్ మొదటి వారంలో ఉపాధి పనులు ప్రతి ఒక్కరికి కల్పిస్తామని చెప్పడంతో వారు వెనుతిరిగారు.

సత్తాచాటిన గురుకుల విద్యార్థులు



విజేతలుగా నిలిచిన అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు

రొళ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో రొళ్ల బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొని తమ సత్తా చాటారు. కబ్బడ్డీ క్రీడలో మొదటిస్థానం, క్రికెట్‌లో రెండో స్థానంలో నిలిచారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆపాఠశాల ప్రిన్సిపల్ మైలారప్ప, కమిటీ చైర్మన్ సుమలు హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- పార్టీలోకి వలస వచ్చిన వారిని స్వాగతించిన గుండుమల



వైసీపీ వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల

మడకశిరటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని, ఆయన నాయకత్వంలో పనిచేసేందుకు అనేక మంది ఆసక్తి చూపుతున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. పట్టణంలోని బాలాజీ టీడీపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మణూరు గ్రామానికి చెందిన పది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వైసీపీ నాయకులు లక్ష్మీనారాయణప్ప, నరసప్ప, ముద్దన్న, నరసింహమూర్తి, చంద్రశేఖర్‌తోపాటు పలువురు మాట్లాడుతూ, గత ఐదేళ్లపాలనలో రాష్ట్రం ఏవిధంగా నష్టపోయిందో పార్టీలో ఉండి చూశామని, ప్రస్తుతం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి తాముకూడా టీడీపీలోకి చేరుతున్నట్లు ప్రకటించారు.

విరివిగా నవధాన్యాల సాగు

గుడిబండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైతులు విరివిగా నవధాన్యాల సాగు చేయాలని రైతు అంబికా సూచించారు. శుక్రవారం మండలంలోని చిగతుర్పి గ్రామంలో రెండు ఎకరాల భూమిలో నవధాన్యాల సాగు చేపట్టారు. రెండు ఎకరాల పొలంలో ఘన జీవామృతంతోపాటు 25 రకాల జీవ వైవిధ్య పంటల సాగును చేపట్టారు. ఈకార్యక్రమంలో మడకశిర డివిజన్ ఇన్‌చార్జి రమేష్, యూనిట్ ఇన్‌చార్జి హనుమంతరాయప్ప, లలిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మందలపల్లి బీసీ హాస్టల్ వార్డెన్ కేశవప్పపై చర్యలు

గుడిబండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలపల్లి బీసీ హాస్టల్‌లో పనిచేస్తున్న కేశవప్పపై చర్యలు తీసుకొంటున్నట్లు పెనుకొండ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్ తెలిపారు. మందలపల్లి బీసీ హాస్టల్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలపై స్పందించిన అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్ మందలపల్లి బీసీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల హాజరుపట్టిక, మెనూ తదితర వాటిని పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులను మెనూ అడిగి తెలుసుకొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు 124 మందికిగాను కేవలం 24 మంది మాత్రమే విద్యార్థులు హాజరవుతున్నారని, హాస్టల్ విద్యార్థులకు కూడా మెనూ సక్రమంగా అందించడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు నివేదిక తయారుచేసి పుట్టపర్తి, డిప్యూటీ డైరెక్టర్‌కు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. వార్డెన్ కేశవప్పపై త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా వార్డెన్‌కు మెమో జారీ చేసినట్లు తెలిపారు.

ఆరో తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

అగళి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలలో 6వ తరగతి పరీక్షలకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. 2025ఏప్రిల్ 20న ఉదయం 10గంటలకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఓసీ, బీసీలు 2013 సెప్టెంబరు1 నుంచి 2015ఆగస్టు31 మధ్య పుట్టి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు 2011సెప్టెంబరు1 నుంచి 2015ఆగస్టు1 మధ్య పుట్టి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలన్నారు. 2024-2025 విద్యాసంవత్సరంలో చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలన్నారు. దరఖాస్తు చేయడానికి ముందుగా వివరాలతో కూడిన సమాచారం కొరకు వెబ్‌సైట్ చూడాలన్నారు. ఇతర వివరాల కోసం ప్రిన్సిపాల్ లేదా ఎంఈఓను సంప్రదించాలన్నారు.

రైతు సేవాకేంద్రాల్లో సర్వర్ సమస్య



జమ్మానిపల్లిలో సర్వర్ సమస్యతో రైతుల పడిగాపులు

మడకశిర రూరల్ ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 14 అంకెల విశిష్ట సంఖ్య కోసం సమీప రైతు సేవాకేంద్రాలో నమోదు చేయించుకోవాలని సూచించడంతో రైతు సేవాకేంద్రాల వద్ద రైతులు బారులు తీరుతున్నారు. అయితే సర్వర్‌సమస్యలతో నమోదు ప్రక్రియ వేగవంతం కావడంలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంల నుంచి ఒంటి గంట వరకు మాత్రమే సర్వర్ ఉంటుందని ఆ తరువాత సర్వర్ సమస్య అధికంగా ఉంటుందని రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు వాపోతున్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారి తిమ్మప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకం కాబట్టి దేశవ్యాప్తంగా నమోదు ప్రక్రియ జరుగుతోందని సర్వర్ సమస్యలు ఉంటాయని అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

మాతృభాషను కాపాడాలి

హిందూపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మాతృభాషను కాపాడాలని ఎంఈఓ గంగప్ప అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000సంవత్సరం ఫిబ్రవరి 21నుంచి మాతృభాష దినోత్సవం జరుపుకుంటున్నారన్నారు. ఇందులో తెలుగుభాష ఔన్నత్యాన్ని గొప్పతనాన్ని తీయదనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు పలు భాషల్లో ప్రసంగించారు. వీరికి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ లక్ష్మీ, అధ్యాపకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

రొళ్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గత నెల నమోదు చేసిన పోక్సో యాక్టు కేసులో ముద్దాయి కిరణ్(21)ను గురువారం సాయంత్రం ఆయన స్వగ్రామం రొళ్ల వడ్రహట్టిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు మడకశిర రూరల్‌సీఐ రాజ్‌కుమార్, తెలిపారు. అతడికి మడకశిర కోర్టు న్యాయాధికారి 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా.. వ్యక్తి మృతి



మృతిచెందిన రమేష్

పరిగి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంగలపల్లి, గొల్లపల్లి రహదారి మధ్యలో ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రొద్దం మండలం బూదిపల్లి గ్రామానికి చెందిన రమేష్(40)అనే వ్యక్తి హిందూపురానికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా బీచిగానిపల్లి-గొల్లపల్లి గ్రామాల మధ్యలో అదుపుతప్పి బోల్తాపడ్డాడు. దీంతో తలకు దెబ్బతగిలి అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు.

మద్యం షాపు సీజ్

చిలమత్తూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు మండల కేంద్రంలో ఉన్న బాలాజీ వైన్ షాపును శుక్రవారం ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. గత నెలలో హిందూపురంలో వెలుగుచూసిన నకిలీ మద్యం కేసుకు సంబంధించిన ఘటనలో చిలమత్తూరు వైన్‌షాపులో పనిచేసే ఓ వ్యక్తి పోలీసులకు పట్టుపడ్డాడు. అతన్ని విచారించిన అనంతరం ఈ నెల 10వ తేదీన వైన్ షాపు సీజ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో శుక్రవారం ఆఘమేఘాల మీద వైన్‌షాపును సీజ్ చేసినట్లు తెలిసింది. దీనిపై స్థానిక ఎక్సైజ్ అధికారులను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు.

మద్యం కేసులో ముగిసిన విచారణ

హిందూపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసుకు సంబంధించి ఎక్సైజ్ పోలీసులు ముగ్గురు నిందితులను కస్టడీలో తీసుకుని విచారించారు. గురు, శుక్రవారాలు విచారించి శుక్రవారం సాయంత్రం కోర్టులో హాజరుపరిచారు. వీరిని రిమాండుకు పంపారు. గత నెలలో హిందూపురం ప్రాంతంలో సంచలనం రేపిన నకిలీ మద్యం కేసులో హిందూపురం లేపాక్షికి చెందిన ముగ్గురిని ఇటీవల ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచి వారిని కస్టడీకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో నకిలీ మద్యంకు సంబంధించి తమకేమి తెలియదని, దీని వెనకాల ఎవరున్నారు ఏమిటన్నది తమకు తెలియదని ఏఈఎస్ శ్రీరామ్, ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్యవద్ద వారు పేర్కొన్నట్లు తెలిసింది.

నకిలీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై కేసులు పెట్టాలి

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భూమి కాజేయాలని చూసిన సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి.. కూటమి నాయకులపై నిందలు వేస్తున్నారని హిందూపురం పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు చిన్నవెంకటరాముడు, కన్వీనర్లు శ్రీరాములు, సిద్దయ్య మండిపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నకిలీ రిజిస్ట్రేషన్‌లు చేసుకుని భూమి కాజేయాలని చూసిన వైసీపీ నాయకులు 420పనులు చేశారని, అసలైన వారసులు రావడంతో ఆ భూమి రికార్డులు పరిశీలించి అధికారులు వారికి అప్పజెప్పారని, అది జీర్ణించుకోలేక నిందలు వేస్తున్నారన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ శెట్టిపల్లి పంచాయతీ పరిధిలో 28సెంట్లు భూమిని 2022లో కృష్ణారెడ్డి భార్య పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. శోత్రియం భూములకు సైతం నకిలీ పత్రాలు సృష్టించి భూమికాజేయాలని చూశారన్నారు. అసలైన వారసులు రావడంతో భూభాగోతం వెలుగులోకి వచ్చిందన్నారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు.